తిరుపతి మొదలుకుని శ్రీకాళహస్తి, పుత్తూరు, నాయుడుపేట, గూడూరు, వెంకటగిరి దాకా సొంతిళ్లులేని పట్టణ పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిధులతో చేపట్టిన గృహ నిర్మాణ పథకాలు అత్యంత దారుణ పరిస్థితుల్లో ఉన్నాయి. వేలాది ఇళ్లు అసంపూర్తిగా భూతాల నిలయాలను తలపిస్తుండగా, పూర్తయిన ఇళ్లలో కుటుంబాలు కనీస వసతులు లేక కొట్టుమిట్టాడుతున్నాయి. సొంతిళ్లు దక్కాయని వాటిల్లో చేరిన లబ్ధిదారుల సంబరం మూన్నాళ్ళ ముచ్చటే అయింది. ఇళ్లలో చేరిన వేల కుటుంబాలు మూన్నాళ్లకే వాటిని విడిచిపెట్టి తిరిగి అద్దె ఇళ్లను వెతుక్కుంటూ పట్టణాలకు తిరుగు ప్రయాణమయ్యాయి. ఇళ్ల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలతో, అధ్వాన పారిశుధ్యం, తాగునీరు లేక పాముల బెడదతో పట్టణ పేదల గృహ సముదాయాలు నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా దర్శనమిస్తున్నాయి. 2014-19 నడుమ టీడీపీ ప్రభుత్వం పేదల పట్ల నిబద్ధతతో మున్సిపల్ పట్టణాలలో ఇళ్ల పథకాలు మంజూరు చేయగా తదుపరి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లూ మౌళిక సదుపాయాల కల్పన పట్ల తీవ్ర నిర్లక్ష్యం కనబరిచింది. దీంతో ఈ సముదాయాలన్నీ దాదాపు నిర్మానుష్యంగా మారిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో మళ్లీ లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా మున్సిపల్ పట్టణాలలో 'ఆంధ్రజ్యోతి నెట్ వర్క్' జరిపిన పరిశీలనలో టిడ్కో ఇళ్ల నిర్మాణ సముదాయాల తీరుతెన్నులిలా వెల్లడయ్యాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


నాయుడుపేటలో టిడ్కో ఇళ్ల దుస్థితి


పుత్తూరులో అర్ధంతరంగా ఆగిన 572 ఇళ్ల నిర్మాణం

వైసీపీ పాపం దక్కని ఆవాసం

- ఐదేళ్లపాటు టిడ్కో ఇళ్లను పట్టించుకోని గత ప్రభుత్వం
- చిన్నపాటి మరమ్మతులూ చేయక.. లబ్ధిదారులకు కేటాయించని వైనం
- 'కూటమి'పైనే అందరి ఆశలు

వెంకటగిరి

ఫినిషింగ్‌కు నోచుకోని 672 ఇళ్లు

వెంకటగిరి పట్టణం తిరుపతి రోడ్డులో గత టీడీపీ ప్రభుత్వం 1824 ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఇందులో 1152 పూర్తవడంతో గత వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు అప్పగించింది. మిగిలిన 672 ఇళ్లను గాలికొదిలేసింది. ఈ ఇళ్ళలో ప్లంబింగ్ పనులు, టైల్స్ ఏర్పాటు, తలుపులు, కిటికీలు, గ్రిల్స్ వంటివి పెండింగులో ఉన్నాయి. ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం వీటిని పూర్తి చేయించలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చొరవతో ఇళ్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. భవన సముదాయాల పక్కన పిచ్చి మొక్కలు, చెట్లు పెరిగిపోవడంతో ప్రస్తుతం నివాసమున్న కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. రోడ్లపైన, పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించే దిక్కు లేదు. తాగునీరు చాలడంలేదు. తెలుగుగంగ నీటిని అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ ఇళ్ల సముదాయంలోని వంద మంది పిల్లలు చదువు కోసం మూడు కిలోమీటర్ల దూరంలోని వెంకటగిరికి వెళుతున్నారు. కాలనీలోనే అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



నాయుడుపేట

ఐదేళ్లుగా పూర్తికాని 15 శాతం పనులు

నాయుడుపేట పట్టణంలో గత టీడీపీ ప్రభుత్వం 2064 ఇళ్లను మంజూరు చేసి.. 85 శాతం పనులు పూర్తి చేసింది. టైల్స్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు మాత్రమే పెండింగులో ఉన్నాయి. తాగునీటి సదుపాయం లేదు. ఈ 15 శాతం పనులను కూడా గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయించలేకపోయింది. దీంతో అధికారులు ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చినా స్థానిక ప్రజాప్రతినిధులు వీటిని పూర్తి చేయించడంపై దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి.



ఇంటికి, మరుగుదొడ్డికి అమర్చని తలుపులు

విక్రుతమాల

1600 కుటుంబాలు వెనక్కి

తిరుపతి నగరంలో సొంతిళ్లులేని నిరుపేదలకు గత టీడీపీ ప్రభుత్వం ఏర్పేడు మండలం విక్రుతమాల వద్ద 1800 ఇళ్లు మంజూరు చేసింది. జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద 2019 ఫిబ్రవరి నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తయింది. అదేనెలలో అప్పటి మంత్రి నారా లోకేశ్, స్థానిక ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఇళ్ల సముదాయాన్ని ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించే లోగా.. ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాయి. 'నీలాద్రి నిలయం' పేరిట నిర్మించిన ఈ ఇళ్లను వైసీపీ ప్రభుత్వం మూడేళ్ల పాటు లబ్ధిదారులకు అప్పగించలేదు. కొవిడ్ సమయంలో వీటిని క్వారంటైన్ కేంద్రంగా వినియోగించింది. 2022 మేలో లబ్ధిదారులు ఆందోళనకు దిగడంతో వారికి ఇళ్లను అప్పగించింది. తాగునీరు, మురుగునీటి కాలువలు, వీధి దీపాలు వంటి కనీస సదుపాయాలు లేకపోవడంతో 1800 కుటుంబాలలో 1600 కుటుంబాలు తిరిగి తిరుపతికి వెళ్లాయి. ఇపుడు 200 కుటుంబాలే అరకొర వసతుల నడుమ ఉంటున్నాయి. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రెండున్నరేళ్ల పాటు లబ్ధిదారులే చందాలు వేసుకుని పారిశుధ్య నిర్వహణ చేపట్టారు. తాగునీరు లేక క్యాన్లు కొనుగోలు చేస్తున్నారు. ఇళ్ల మధ్య పిచ్చిమొక్కలు పెరిగి పాముల బెడద అధికంగా ఉంది. గతేడాది ఆరేళ్ల చిన్నారిని ఇంట్లోనే పాము కాటేసింది. పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో దోమలు ప్రబలి.. విష జ్వరాలు వ్యాపిస్తున్నాయి.



విక్రుతమాల ఇళ్ల సముదాయంలో రోడ్డు దుస్థితి, (ఇన్‌సెట్‌లో) తాగునీటి పైపులైను దుస్థితి

గూడూరు

చెల్లాచెదురైన లబ్ధిదారులు

గూడూరు పట్టణం గాంధీనగర్ సమీపంలో గత టీడీపీ ప్రభుత్వం 5120 టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. నిర్మాణం పూర్తయ్యే సరికి ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వం 2022 జూన్‌లో 5120 ఇళ్లలో 3358 మందికి ఇళ్లను అప్పగించింది. అందులో 1200 మంది నివాసానికి వచ్చారు. కండలేరు నుంచి ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైను మరమ్మతులకు గురవడంతో తాగునీటి కొరత ఏర్పడి సుమారు 400 కుటుంబాలు టిడ్కో ఇళ్లను విడిచిపెట్టి పట్టణంలోకి వెళ్లిపోయాయి. తర్వాత 800 కుటుంబాలే ఉన్నాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం రావడంతో ఎమ్మెల్యే సునీల్‌కుమార్ సొంత నగదుతో పైపులైనుకు మరమ్మతులు చేయించారు. దీంతో నివాసితుల సంఖ్య 800 నుంచి 1254కు పెరిగింది. సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు బాగున్నా.. బ్లాకుల మధ్య పిచ్చి మొక్కలు పెరిగిపోయి అడవిని తలపిస్తున్నాయి. విష పురుగులు చేరుతున్నాయి. లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లుపోను మిగిలిన ఇళ్ల లబ్ధిదారులు తలోదిక్కున చెదిరిపోయారు. ఇప్పుడు ఎమ్మెల్యే చొరవతో అధికారులు వారి వివరాలు సేకరించి ఇళ్లను అప్పగించే పనిలో పడ్డారు.


టిడ్కో ఇళ్ల సముదాయంలో బ్లాకుల నడుమ పెరిగిపోయిన పిచ్చి మొక్కలు

శ్రీకాళహస్తి

గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట

శ్రీకాళహస్తి శివార్లలోని రాజీవ్‌నగర్ సమీపంలో 6015 ఇళ్ల భారీ సముదాయానికి 2017 డిసెంబరు 10న అప్పటి మున్సిపల్ మంత్రి నారాయణ శంకుస్థాపన చేశారు. నిర్మాణం జరుగుతుండగా 2019లో ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టు సంస్థను మార్చింది. పనులు ప్రారంభం కాని 1632 ఇళ్లను రద్దు చేసింది. 4064 ఇళ్లు మంజూరు చేయాలని అప్పటి అధికార పార్టీ నేతలు ఖరారు చేశారు. అయితే 816 ఇళ్లనే కట్టించగలిగారు. ఆ ఇళ్లలోనూ పెయింటింగ్, ఇంటీరియర్, ఉడ్ వర్క్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు పెండింగులో ఉన్నాయి. ఐదేళ్లయినా ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. 25 శాతం పెండింగ్ ఉన్న పనులు కూడా పూర్తి కాలేదు. దీంతో లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించలేదు.


టిడ్కో ఇళ్ల సముదాయంలో రోడ్ల దుస్థితి

పుత్తూరు

మరీ దారుణం

పుత్తూరు పట్టణంలో గత టీడీపీ ప్రభుత్వం 1060 టిడ్కో ఇళ్లు మంజూరు చేసింది. 1008 మంది లబ్ధిదారులు తమ వాటా కింద నగదు చెల్లించారు. నిర్మాణం మొదలయ్యాక ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వంలో 432 ఇళ్లు పూర్తయినా ఫినిషింగ్ పనులు పెండింగులో ఉంచి లబ్ధిదారులకు కేటాయించలేదు. మిగిలిన 572 ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా ఆగిపోయింది. ఐదేళ్లలో తలుపులు, కిటికీలు వంటివి కూడా వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోయింది. దీంతో మొత్తం ప్రాజెక్టే నిరుపయోగంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో లబ్ధిదారులు ఇకనైనా తమకు ఇళ్లు దక్కుతాయని ఆశిస్తున్నారు.


స్వల్ప పెండింగు పనులతో లబ్ధిదారులకు దక్కని ఇళ్లు

సూళ్లూరుపేట

లబ్ధిదారులకు దక్కని ఇళ్లు

సూళ్లూరుపేట పట్టణంలో 2018లో 1632 టిడ్కో ఇళ్ళను అప్పటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. జీ ప్లస్ త్రీ చొప్పున బ్లాకుకు 48 ఇళ్లతో 34 బ్లాకుల నిర్మాణం చేపట్టింది. 2019 డిసెంబరు నాటికి 1600 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. పెయింటింగ్ కూడా వేశారు. సీసీ రోడ్లు, డ్రెయిన్లు కూడా నిర్మించారు. విద్యుత్ స్తంభాలు నాటారు. వీటికి లైన్లు ఏర్పాటు, తాగునీటి సదుపాయం కల్పించాల్సి ఉంది. ఈ కొద్దిపాటి పనులను గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు చేయలేకపోయింది. ఇప్పటికీ ఆ పనులు పెండింగులోనే ఉన్నాయి. పూర్తయిన ఇళ్లను ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు కేటాయించలేదు.



పింఛనుతో ఆసరా ఇవ్వండి



'అయ్యా.. మాది సూళ్లూరుపేట సమీపంలోని తనియాల గ్రామం. 11 నెలల క్రితం బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో పక్షవాతం సోకింది. మంచానికే పరిమితమయ్యాను. పక్కన వారి సహాయం లేకుండా ఏ పనీ చేసుకోలేను. పూట గడవడమే ఇబ్బందిగా ఉంది. పింఛను వస్తే కాస్త ఆసరాగా ఉంటుంది. సదరం సర్టిఫికెట్ కోసం అధికారులు ముప్పతిప్పలు పెడుతున్నారు. మీరైనా న్యాయం చేయండి' అంటూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు మునిరాజా విజ్ఞప్తి చేశారు.

- మరిన్ని వినతులు, ఫిర్యాదులు.. 8లో

తిరుపతి-పాకాల మధ్య రెండవ మార్గం

- సర్వే పనులకు రైల్వేబోర్డు అనుమతి

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి-పాకాల రైల్వే స్టేషన్ల మధ్య పెండింగ్‌లో వున్న రెండవ రైలు మార్గం సర్వే పనులకు రైల్వే బోర్డు అనుమతించినట్లు సమాచారం. ఈ మార్గం మీటర్ గేజ్ నుంచి బ్రాడ్ గేజ్‌కు మారిన తరువాత రైళ్ళ సంఖ్య బాగా పెరిగింది. పెరిగిన రైళ్ళ కారణంగా తిరుపతి-పాకాల-ధర్మవరం మధ్య రాకపోకలకు ఆలస్యం అవుతోంది. దీంతో ఈ మార్గంలో రెండవ రైలు మార్గం ఏర్పాటు చేయాలని తిరుపతికి వచ్చిన ఉన్నతస్థాయి అధికారులకు చాలా కాలంగా ప్రజా ప్రతినిధులు వినతులు ఇస్తున్నారు.కొన్నేళ్ళుగా ప్రజాప్రతినిధుల పోరాటం ఫలించింది.రైల్వే ఉన్నతాధికారులు స్పందించి రెండవ రైలు మార్గం ఏర్పాటుపై సర్వే చేయాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు.రైల్వే నిర్మాణాల విభాగం అధికారులు సర్వే పనులు ప్రారంభించారు.



రెవెన్యూ సదస్సులకు 596 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 596 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం తెలిపారు. రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలను సులభంగా పరిష్కరించుకోవచ్చన్నారు. మండల, గ్రామస్థాయి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం 29 గ్రామసభలను నిర్వహించినట్లు తెలిపారు. సోమవారం వరకు జిల్లా వ్యాప్తంగా 6,316 అర్జీలు వచ్చాయని అందులో సోమవారం వచ్చిన 596లో భూఆక్రమణలపై 2, హౌస్ సైట్స్‌పై 111, అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్‌పై 44, రీసర్వేపై 31, జీఎస్‌డబ్ల్యూఎస్‌పై 12, ఇళ్ల స్థలాలు, ప్రాజెక్టులు భూసేకరణపై 20, ల్యాండ్ గ్రాబింగ్‌పై 1, ఆర్‌వోఆర్‌కు 221, ఇతర రెవెన్యూ విషయాలకు సంబంధించి 152 వచ్చినట్లు తె లిపారు. అర్జీలను కాలపరిమితి లోపు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

భక్తుడి పట్ల దురుసు ప్రవర్తన

- కాణిపాక ఆలయ ఉద్యోగిపై మంత్రి లోకేశ్‌కు ఎక్స్‌లో ఫిర్యాదు
- విచారించి తొలగించిన ఈవో

ఐరాల (కాణిపాకం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'కాణిపాక ఆలయంలో దారుణంగా దోపిడీ చేస్తున్నారు. 500రూపాయలతో సాధారణ ఆశీర్వాద టికెట్ తీసుకున్నాం. దానిపై ఇద్దరికి అనుమతి అని రాసి ఉంది. కానీ అక్కడి సిబ్బంది ఒకరినే లోపలికి పంపించారు. అడిగితే ఇక్కడ రూల్స్ అంతే. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అన్నాడు. భక్తులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలి' అని కిశోర్ గౌడ్ అనే భక్తుడు ఎక్స్(ఒకప్పటి ట్విట్టర్)లో ఈ నెల 14వ తేదీన ట్వీట్ చేశాడు. మంత్రి నారా లోకేశ్‌కు ట్యాగ్ కూడా చేశాడు. ఈ అంశంపై లోకేశ్ ఒకరోజు వ్యవధిలో అంటే ఆదివారం స్పందించారు. నిష్పక్షపాతంగా విచారించి చర్యలు తీసుకుంటామని ఎక్స్‌లో రీపోస్టు పెట్టారు. ఇదిలా ఉండగా భక్తుడి పట్ల దురుసుగా ప్రవర్తించిన డైలీవేజెస్ ఉద్యోగి కుట్టిబాబును విధుల నుంచి నిలిపి వేస్తున్నామని ఈవో కిశోర్ సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనను 'ఆఫీస్ ఆఫ్ నారా లోకేశ్ ఎక్స్ అకౌంట్‌లో సోమవారం పోస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..కిశోర్ గౌడ్ అనే భక్తుడు ఆలయ టికెట్ కౌంటర్ వద్ద రూ.500 సాధారణ ఆశీర్వాద టికెట్టును కొనుగోలు చేశారు. ఈ టికెట్టుతో తమను దర్శనానికి అనుమతించాలని ఆలయ ఉద్యోగిని కోరారు. దీంతో ఒకరిని మాత్రమే స్వామి దర్శనానికి అనుమతిస్తానని కుట్టిబాబు దురుసుగా సమాధానం చెప్పాడు. దీంతో ఆగ్రహించిన సదరు భక్తుడు ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు.ఆయన వెంటనే దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో మాటాడి విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఈవో కిషోర్ ఈ విషయాన్ని క్షుణ్ణంగా ఆరా తీసి కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న కుట్టిబాబును తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారించనున్నట్లు ఈవో కిషోర్ వివరించారు. ఈ నేపథ్యంలో ఆలయ ఉద్యోగులు,సిబ్బందితో సోమవారం ఈవో సమావేశమయ్యారు.భక్తులతో మర్యాదగా నడుచుకోవాలని,గౌరవంగా సంభోదించాలని సూచించారు. ఎక్కడ ఎవరు తప్పు చేసినా ఆలయ ప్రతిష్ఠ దెబ్బతింటుందని కాబట్టి ప్రతి ఒక్కరూ ఆలయం పట్ల బాధ్యతగా ఉండాలన్నారు.

చంద్రగిరి

నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి


మాట్లాడుతున్న డాక్టర్ చేకూరి కోదండ రామానాయుడు

రామచంద్రాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని ప్రవాస భారతీయుడు డాక్టర్ చేకూరి కోదండ రామానాయుడు అన్నారు. కమ్మకండ్రిగ గ్రామానికి చెందిన ఆయన మిట్టూరు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాలను ఎంచుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. యోగా, వ్యాయామం, పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. పాఠశాలలో కంప్యూటర్, డిజిటల్ ల్యాబ్‌ల ఏర్పాటుకు ఉపాధ్యాయులు కోరడంతో.. వెంటనే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పేద విద్యార్థిని యాస్మిన్ పెరుగదల కోసం అయ్యే వైద్య ఖర్చులను భరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కోదండ రామా నాయుడిని ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వాగ్దేవి, చేకూరి ఆనంద నాయుడు, చేకూరి జనార్దన్‌చౌదరి, ఉమామహేశ్వర్, వెంకట్రామయ్య, స్వయంప్రభ, కృష్ణార్జున రెడ్డి, శ్రీనివాసులు, మురళీ, భార్గవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరపురం రోడ్డు పరిశీలన


రోడ్డు పరిశీలిస్తున్న తహసీల్దారు వెంకటరమణ

రామచంద్రాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనుపల్లి పంచాయతీ గోకులాపురం భువనేశ్వరపురం రోడ్డును సోమవారం తహసీల్దారు వెంకటరమణ పరిశీలించారు. భువనేశ్వరపురం గ్రామస్తులు గ్రామానికి వచ్చే దారి ఆక్రమణకు గురికావడంతో ఇబ్బందులు పడుతున్నామని గత నెల పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తహసీల్దారు సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆక్రమణ దారులతో చర్చించి 15 అడుగుల వెడల్పు రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డెమో అధికారి కిరణ్ కుమార్

భాకరాపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా డిప్యూటీ డెమో అధికారి కిరణ్ కుమార్ అన్నారు. చిన్నగొట్టిగల్లు స్త్రీ శక్తి భవన్‌లో మహిళా సమాఖ్య సభ్యులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో నీరు కలుషితమయ్యే అవకాశం ఉంటుందన్నారు. నివాస పరిసరాల్లో నీటి నిల్వలు ఉంటే దోమలు పెరిగి మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధుల బారిన పడుతారని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు శివశంకర, లక్ష్మీదేవి, వైద్య సిబ్బంది, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో సిద్దార్థ విద్యార్థుల ప్రతిభ


ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన విద్యార్థులు

చంద్రగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన ఇంటర్ స్కూల్ తైక్వాండో పోటీలలో చంద్రగిరిలోని సిద్దార్థ స్కూల్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారు. తైక్వాండో పోటీలలో పలు పాఠశాలల నుంచి 500 మందికిపైగా పాల్గొన్నారు. ఇందులో చంద్రగిరిలోని సిద్దార్థ పాఠశాల నుంచి 81 మంది విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఇందులో 18 మంది విద్యార్థులు బంగారు, 29 మంది విద్యార్థులు రజితం, 30 మంది విద్యార్థులు కంచు పతకాలతో పాటు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. స్కూల్ కరస్పాండెంట్ రామకృష్ణమూర్తి, డైరెక్టర్ అండ్ హెడ్ మాస్టర్ వన చంద్రబాబు, అకడమిక్ హెడ్ సింధు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

విద్యార్థినులకు ప్రోత్సాహక నగదు బహుమతులు


బహుమతులు అందుకున్న విద్యార్థినులు

పాకాల, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన 13 మంది విద్యార్థినులకు సోమవారం ప్రోత్సాహక నగదు బహుమతులు అందించారు. పాకాల ప్లాటినమ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భరత్ కుమార్ సహకారంతో విద్యార్థినులు జె.వెన్నెల, ఎం.బేబీ, కె.భావన, ఎ.నవ్య, వి.భవ్య, కె.పురంధరేశ్వరి, వి.జాహ్నవి, టి.జ్యోత్స్న, కె.మనీషా, ఎ.అఖిల, ఆర్.యమున, జి.కన్నమ్మ, ఎ.ఏంజెల్ నగదు బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బేబీశ్వరరెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తులసీరామన్, ప్రతినిధులు జి.రామయ్య, జి.గురుస్వామినాయుడు, దొరస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు చెల్లించాలి


ఎంఈఓకి వినతి పత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పాకాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు మధుసూదన్‌రావు కోరారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం ఎదుట సోమవారం మధాహ్నం కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. 5 నెలలుగా వేతనాలు, బిల్లులు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర ధరలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అనంతరం ఎంఈవో బాబ్జీకి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాగ వేణి, లత, రాజేశ్వరమ్మ, కౌసల్య, సెల్వి పాల్గొన్నారు.

పాకాల మీదుగా విజయవాడకు బస్సు సర్వీస్

పాకాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నుంచి పాకాల మీదుగా విజయవాడకు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు ప్రారంభిస్తున్నట్లు పుంగనూరు డిపో మేనేజర్ కె.సుధాకరయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పుంగనూరు నుంచి చౌడేపల్లి, సోమల, సదుం, కల్లూరు, దామలచెరువు, పాకాల, తిరుపతి మీదుగా విజయవాడకు సర్వీసు నడుపుతామన్నారు. ఈనెల 18వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు పుంగనూరు నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు విజయవాడ చేరుతుందన్నారు. తిరిగి అదే రోజు 7.45 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి పుంగనూరుకు ఉదయం 7.45 లకు చేరుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైభవంగా కోటిలింగేశ్వరస్వామికి తిరుమంజనం



రామచంద్రాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాయలచెరువు కట్టపైనున్న కామాక్షి సమేత కోటిలింగేశ్వరస్వామికి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం శాస్త్రోక్తంగా తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో 108 శివలింగాలకు రుద్రాభిషేకం చేశారు. అనంతరం మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పంటలపై ఏనుగుల దాడులు


ఏనుగులు విరిచేసిన కొబ్బరి చెట్లు

భాకరాపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భాకరాపేటలోని రైతు చిట్టి సురేంద్రకు చెందిన సపోటా, కొబ్బరి చెట్లను ఆదివారం రాత్రి ఏనుగులు దాడులు చేసి ధ్వంసం చేశాయి. ఏనుగుల దాడులు రోజూ కొనసాగుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆరేళ్లలోపు పిల్లలకు నేటి నుంచి ఆధార్ నమోదు

తిరుపతి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలో అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో 0-6 ఏళ్లలోపు పిల్లలకు మంగళ, బుధవారాలు రెండురోజుల పాటు ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. మండలంలో అవిలాల, తిరుచానూరు, చెర్లోపల్లె గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు శిబిరాలను ఏర్పాటు చేశామని.. అంగన్‌వాడీ కార్యకర్తలు.. ఆయాలు తమ పరిధిలోని పిల్లల జాబితా సేకరించి వారికి కావాల్సిన పత్రాలను సిద్ధం చేయాలని సూచించారు. పిల్లలకు కొత్త ఆధార్ నమోదుకు ప్రోత్సహించాలని కోరారు. అవిలాల కేంద్రంలో అవిలాల, ఆంధ్రాబ్యాంక్ కాలనీ, ధనలక్ష్మీనగర్, శాంతినగర్-1,2, లింగేశ్వరనగర్, శ్రీనివాసపురం, పద్మావతీపురం, చిగురువాడ, దుర్గసముద్రం, మల్లంగుంట, తిరుచానూరులో యోగిమల్లవరం, తిరుచానూరు, చైతన్యపురం, లక్ష్మీనగర్‌కాలనీ, దామినేడు, పాడిపేట, బ్రాహ్మణపట్టు, తనపల్లె, ఓటేరు, వేదాంతపురం, చెర్లోపల్లెలో వెంకటపతినగర్, చెర్లోపల్లె, పుదిపట్ల, పేరూరు, హరిపురంకాలనీ, విద్యానగర్, తుమ్మలగుంట, గొల్లపల్లె, సి.మల్లవరం, పెరుమాళ్లపల్లె, ఎస్వీనగర్ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

నేడు 'ఉపాధి' బహిరంగ సభ

పాకాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీలో గత ఏడాది చేపట్టిన పనులపై జరిగిన సామాజిక తనిఖీలోని వివరాలను వెల్లడించేందుకు మంగళవారం ఉదయం పాకాల మండల పరిషత్తు కార్యాలయంలో ఉపాధి బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అరుణ తెలిపారు. లబ్ధిదారులు, కూలీలు, రైతులు హాజరు కావాలని.. సమస్యలుంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

జోరుగా గ్రావెల్ అక్రమ రవాణా

- అధిక లోడ్డు టిప్పర్లతో ప్రజల భయాందోళనలు
- పట్టించుకోని అధికారులు


బొప్పరాజుపల్లె-గంగుడుపల్లె మార్గంలో తవ్వుతున్న గ్రావెల్

చంద్రగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండల సరిహద్దుల నుంచి జోరుగా గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారు. అయితే అనుప్పల్లి, చంద్రగిరి మార్గంలో గ్రావెల్ టిప్పర్లు అధిక లోడ్డుతో వేగంగా తిరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో అనేకసార్లు అక్రమంగా గ్రావెల్ తరలింపుపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. చంద్రగిరి, రామచంద్రాపురం మండల సరిహద్దులై గ్రామాలు బొప్పరాజుపల్లె, ఎల్వీపురం సమీపంలోని గుట్టలను అక్రమదారులు ఎంచుకొని గంగుడుపల్లె, మండపంపల్లె, దోర్నకంబాల, మల్లయ్యపల్లె, నాగలచెరువు, ఇందిరమ్మ కాలనీ ప్రాంతాల మీదుగా తిరుపతి సమీపంలోకి టిప్పర్లతో గ్రావెల్‌ను తరలిస్తున్నారు. గ్రావెల్ తరలించే టిప్పర్ల కారణంగా రోడ్డు గుంతలమయం అవుతోంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ, మైనింగ్, పోలీస్, రవాణా శాఖ అధికారులు స్పందించి అనధికారికంగా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పంటలకు రక్షణ కల్పించాలని నిరసన


భాకరాపేటలో నిరసన తెలుపుతున్న బాధిత రైతులు

భాకరాపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడుల నుంచి పంటలను కాపాడాలని భాకరాపేట గాంధీ కూడలిలో రైతులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా ఏనుగులు తమ పంట పొలాలపై దాడులు చేసి నాశనం చేస్తున్నాయన్నారు. దీంతో పెట్టిన పెట్టుబడులు పూర్తిగా నష్టపోయామన్నారు. ఏనుగులు పంట పొలాలపైకి రాకుండా అడవుల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులను పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పోలీసులు అక్కడకు చేరుకుని రైతులకు నచ్చజెప్పారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అనంతరం రైతులు అటవీశాఖ కార్యాలయానికి చేరుకొని రేంజర్‌కు సమస్యలు విన్నవించారు. నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వారం రోజుల్లో ఏనుగులు అడవుల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని భాకరాపేట రేంజర్ వెంకటరమణ రైతులకు హామీ ఇచ్చారు. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో కందకాలు తీసేందుకు అనుమతుల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపామని, వారి ఆదేశాలు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో గైడ్లను ప్రోత్సహించొద్దు



చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రశ్న పత్రాలను ఇకపై సమీప పోలీసు స్టేషన్ (పీఎస్)లో డిపాజిట్ చేసి, పరీక్షల సమయంలో తీసుకోవాలని ఆర్జేడీ శామ్యూల్ ఆదేశాలు జారీ చేశారు. డీఈవో కార్యాలయంలో సోమవారం నుంచి మూడ్రోజులపాటు చేపట్టే తనిఖీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన ఆయన పలు అంశాలను మీడియాకు వివరించారు. ప్రస్తుతం సమ్మెటివ్ అసెస్మెంట్-1 పరీక్షల్లో భాగంగా ఆదివారం యూట్యూబ్‌లో గణితం సబ్జెక్టు పేపర్లు లీక్ కావడంతో కమిషనర్ ఆదేశాల మేరకు 6వ తరగతి నుంచి టెన్త్ వరకు పరీక్షను వాయిదా వేసినట్లు తెలిపారు. దీనిపై విజయవాడలో కమిషనర్ స్థాయిలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. తనిఖీలయ్యాక నివేదికలను కమిషనర్‌కు పంపుతామన్నారు.

కాలువ పోరంబోకు భూమిలో హెచ్చరిక బోర్డు



కాలువ పోరంబోకులో బోర్డును ఏర్పాటు చేసిన అధికారులు

తిరుపతి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామ పంచాయతీ పరిధిలోని బూరగమాను వద్ద సర్వే నంబరు 2/9లోని ప్రభుత్వ కాలువ పోరంబోకు భూమిలో సోమవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గతనెల 20న ఆంధ్రజ్యోతిలో 'కాలువ పోరంబోకు భూమి ఆక్రమణకు యత్నం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. తహసీల్దారు రామాంజులునాయక్ ఆదేశాల మేరకు వీఆర్వో రమేష్ స్థలాన్ని పరిశీలించి బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిలో ఎలాంటి క్రయ విక్రయాలు జరిగినా, ఆక్రమించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని బోర్డులో పొందుపరిచారు.

పేరూరులో శ్మశాన స్థలం సర్వే


సర్వేచేస్తున్న సచివాలయ సర్వేయర్

తిరుపతి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేరూరు పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్‌కాలనీ వద్ద శ్మశాన స్థలాన్ని మండల సర్వేయర్ హేమకుమార్ సోమవారం సర్వే చేశారు. ఇప్పటికే సగానికిపైగా స్థలం ఆక్రమణలకు గురైన విషయం తెలిసిందే. ఈ సర్వేతో 1.75 ఎకరాల స్థలం మిగిలి ఉన్నట్లు గుర్తించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో చుట్టూ ప్రహరీ ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగూరు శ్రీనివాసులు తెలిపారు. ఈ స్థలంలో చర్చి ఏర్పాటుకు తాము కొంతభూమిని కొనుగోలు చేశామని కొందరు వచ్చారు. ఎవరైతే విక్రయించారో వారిని వెళ్లి అడగాలని కూటమి నేతలు సూచించడంతో వెనుదిరిగారు. సచివాలయ ఉద్యోగులు, టీడీపీ నేతలు కాయం వెంకటేష్, దామినేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్కిల్‌హబ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పుత్తూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(స్కిల్‌హబ్) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. ఈనెల 21నుంచి ప్రారంభం కానున్న కోర్సుల్లో చేరే అభ్యర్థులు టెన్త్, డిగ్రీ అర్హత కలిగి వుండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆధార్‌కార్డు, మార్కుల జాబితా, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు రసూల్ నెం.6300954441లో సంప్రదించాలని తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 47 మద్యం కేసుల పరిష్కారం

- రూ.2.30 లక్షల జరిమానా వసూలు

పుత్తూరు అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో 47 మద్యం కేసులు పరిష్కారమయ్యాయని పుత్తూరు ఎక్సైజ్ శాఖ సీఐ మురళీ మోహన్ పేర్కొన్నారు. ఇందుకు రూ.2.08 లక్షల జరిమానాను నిందితులు చలానా రూపంలో చెల్లించినట్లు తెలిపారు. ఎక్సైజ్ శాఖ దాడుల్లో పట్టుబడిన మద్యం అక్రమ విక్రయదారులపై కేసులు నమోదయ్యాయి. పది లీటర్లకు లోబడి పట్టుబడిన మద్యం కేసులను మాత్రమే లోక్ అదాలత్‌లో పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు సీఐ చెప్పారు. ఈక్రమంలో 2023 నుంచి నమోదైన కేసులను ఈనెల 14న శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో పెట్టినట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం ఎమ్మార్పీ ఆధారంగా మూడు రెట్లు జరిమానా విధించి నిందితుల నుంచి చలానా రూపంలో చెల్లింపులు చేయించామన్నారు. చార్జ్‌షీట్ మొదలు హియరింగ్, క్రాస్ ఎగ్జామిన్, వాయిదాలకు హాజరు వంటి పరిణామాలు లోక్ అదాలత్ ద్వారా అధిగమించినట్లు నిందితులు చెబుతుండటం గమనార్హం.

శాస్త్రోక్తంగా మహా రుద్రాభిషేకం



వడమాలపేట, డిసెం బరు 16(ఆంధ్ర జ్యోతి): మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా పట్టణంలోని భవానీ శంకర ఆలయంలో మహా రుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వ హించారు. సోమ వారం వేకువ జామున మహాలింగానికి వేదమంత్రాలతో అభిషేకం నిర్వహించారు. లింగాన్ని పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించి మంగళ హారతులిచ్చారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

17 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

భాకరాపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అపార్ నమోదు కోసం ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో గిడ్డయ్య తెలిపారు. ఈ నెల 17 నుంచి 20 వరకు చిన్నగొట్టిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని విద్యార్థుల కోసమే ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు తగిన ఆధారాలతో తమ ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు.

అవిలాలలో ఇసుక స్టాక్ పాయింట్



తిరుపతి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ పరిధిలో పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో ఇసుక స్టాక్ పాయింట్(ఇసుకనిల్వ కేంద్రం)ను కేటాయించారు. దీన్ని టెండర్ ద్వారా ఏడాది కాలానికి లీలా ఎంటర్‌ప్రైజెస్ సంస్థ దక్కించుకుంది. రాజంపేట సమీపంలోని టంగుటూరు రీచ్ నుంచి ఇసుకను కొనుగోలు చేసి ఈ కేంద్రానికి తరలించి విక్రయిస్తున్నారు. టన్ను రూ.700 చొప్పున విక్రయిస్తున్నారు. ట్రాక్టర్‌కు నాలుగు టన్నుల వరకు, టిప్పర్‌కు 20 టన్నుల వరకు ఇసుకను నింపవచ్చని కేంద్రం నిర్వాహకులు అంటున్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

వెదురుకుప్పం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న తేజశ్రీ ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాసులు, వ్యాయామ సంచాలకుడు రమేష్ తెలిపారు. ఈనెల 18 నుంచి 23వ తేదీవరకు జమ్ముకశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. సోమవారం ఈ విద్యార్థినిని ఉమ్మడి చిత్తూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జనార్ధన్ యాదవ్, రమేష్ అభినందించారు.

చక్రేశ్వరస్వామికి ఆరుద్ర పూజలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మ గుడి వీధిలో కొలువై ఉన్న చక్రేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా స్వామివారికి పలు రకాల అభిషేకాలను నిర్వహించి విశేషంగా అలంకరించారు. అనంతరం వేదపండితులు ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కేంద్రమంత్రికి సాదర వీడ్కోలు



రేణిగుంట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర చేనేత మంత్రి గిరి రాజ్‌సింగ్‌కు సాదరంగా వీడ్కోలు పలికారు. తిరుపతిలో రెండు రోజుల పర్యటన నిమిత్తం విచ్చేసిన ఆయన సోమవారం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి విమానాశ్రయం వద్ద టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ నాయకురాలు తేజోవతి తదితరులు కేంద్ర మంత్రికి వీడ్కోలు పలికారు.

ముక్కంటి సేవలో సినీ దర్శకుడు పరశురామ్



శ్రీకాళహస్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని సోమవారం సినీ దర్శకుడు పరశురామ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా మనోన్మణి ఉత్సవం



శ్రీకాళహస్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ముక్కంటీశుడి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని సోమవారం మనోన్మణి (గొబ్బెమ్మ) ఉత్సవం వైభవంగా నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో గొబ్బిదేవతకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారిని చప్పరంపై అధిష్టింపజేసి పట్టణంలో ఊరేగించారు. అమ్మవారికి భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

ఆగమోక్తంగా మృత్యుంజయుడికి పూజలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృ త్యుంజయస్వామికి సోమవారాన్ని పురస్కరిం చుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. ముందు గా వినాయకుడికి పూజలు చేశారు. అనంత రం మృత్యుంజయుడికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకిం చారు. గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

తిరుపతి

ప్రజా ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించండి



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో 49 మంది వివిధ సమస్యలతో కూడిన వినతులను కమిషనర్‌కు అందజేశారు. తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్లు ఆర్సీ మునికృష్ణ, అనిల్ కుమార్ వినతులు సమర్పించారు. టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని, పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని, అర్హులైన వారికి పింఛన్లు ఇప్పించాలని, తమ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని రక్షణ కల్పించాలని, మురుగు కాలువల్లో చెత్త తొలగించాలని కోరారు. ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ శ్యాంసుందర్, డీసీపీ మహాపాత్ర, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, ఆర్వోలు సేతు మాధవ్, రవి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర తదితరులు పీజీఆర్ఎస్‌లో ఉన్నారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు టైంస్కేల్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరసింగరావు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, స్కీం వర్కర్స్‌కు ప్రభుత్వం టైంస్కేల్ ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. తిరుపతి యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సోమవారం కాంట్రాక్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి పార్టీల నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు టైంస్కేల్ అమలు చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. స్కీం వర్కర్లకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కోరారు. 104, 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, కార్మికులకు ఎక్స్‌గ్రేషియాను రూ.20 లక్షలకు పెంచాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎస్.జయచంద్ర, జి.నాగవెంకటేష్, వరలక్ష్మి, సుబ్బరత్నమ్మ, రఘు, నరసింహులు, లక్ష్మీనారాయణ, సుభాన్, అమరనాథ్, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరు ఎర్రచందనం దుంగల స్వాధీనం - ఒకరి అరెస్టు



స్మగ్లర్లను అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మంగళం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా చెయ్యేరు నదీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐ వై.విశ్వనాథ్ బృందం జొండ్రపెంట ఎఫ్‌బీవోతో కలిసి ఆదివారం గుర్రపుబాట తూర్పువైపు ఉన్న చెయ్యేరు వద్ద కూబింగ్ చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున మేకలకోన వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. చుట్టుముట్టేందుకు ప్రయత్నించగా దుంగలు పడేసి పారిపోయారు. వెంటపడి ఒకరిని పట్టుకున్నారు. ఆ ప్రాంతంలో పరిశీలించగా ఆరు ఎర్రచందనం దుంగలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని, పట్టుబడ్డ స్మగ్లర్‌ను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగువారి ఆత్మగౌరవం పొట్టి శ్రీరాములు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సూర్యనారాయణమూర్తి

తిరుపతి (లీలామహల్), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవం కోసం ప్రాణాలు సైతం త్యాగం చేసిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని గెజిటెడ్ లైబ్రేరియన్ సూర్యనారాయణమూర్తి కొనియాడారు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ కె.సునీల్‌బాబు, ఉపాధ్యాయులు శంకర్, కోదండరామ హైస్కూల్ విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోండి - రిమ్స్‌లో ముగిసిన టెక్నో, గ్యాబ్‌ఫెస్ట్



పావనికి యంగ్ మేనేజర్ అవార్డును ప్రదానం చేస్తున్న ఆనందరెడ్డి, పక్కనే డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి

తిరుపతి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పోటీ ప్రపంచంలో విద్యార్థులు అకడమిక్స్‌తో పాటు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ కళాశాల డైరెక్టర్ వై.ఆనందరెడ్డి తెలిపారు. బైరాగిపట్టెడలో రిమ్స్ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్) కోర్సులు చదివే విద్యార్థులకు నిర్వహించిన టెక్నో అండ్ గ్యాబ్‌ఫెస్ట్-2కే24 ముగింపు కార్యక్రమాన్ని సి.గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఎంబీఏ విభాగంలో పావని, ఎంసీఏలో సుజిత్, పావనిలు యంగ్ మేనేజర్ అవార్డులు సాధించారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డి, ఎంబీఏ హెడ్ డాక్టర్ నిరంజన్‌రెడ్డి, ఎంసీఏ హెడ్ పి.మధురతో ఆనందరెడ్డి కలిసి నగదు బహుమతి, అవార్డులు, సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చైర్మన్ వై.కొండారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ వై.విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ జంప్‌రోప్ పోటీలకు ఎంపిక

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ జంప్‌రోప్ పోటీలకు మంగళం ట్రెండ్స్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. గత ఆదివారం సత్యసాయి జిల్లా కదిరిలో జరిగిన రాష్ట్రస్థాయి 5వ జూనియర్ అంతర్ జిల్లా ఛాంపియన్‌షిప్‌లో రమశ్రీ(ఇంటర్), కోకిలరెడ్డి (8వ తరగతి), సుకన్య (6వ తరగతి) అత్యుత్తమంగా రాణించి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. సోమవారం పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం కేశవులనాయుడు ఆధ్వర్యంలో క్రీడాకారులను సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు సాంబశివరావు, రామకృష్ణ, శ్రీధర్, జగన్నాథరావు, మనోహర్, కృష్ణమనాయుడు, మునిరత్నం, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రోగులకు అందుబాటులో హెల్ప్‌డెస్క్‌లు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హెల్ప్‌డెస్క్‌లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. స్విమ్స్ హెల్ప్‌డెస్క్‌లో సిబ్బంది రోగులకు అందుబాటులో లేకపోవడంపై ఆదివారం స్విమ్స్ హెల్ప్‌లెస్ డెస్క్ శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆయన సోమవారం హెల్ప్‌డెస్క్‌లను పరిశీలించారు. రోగులకు సమాచారం అందించడంలో, వైద్య పరీక్షల రిపోర్టులు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామన్నారు.

ఉరేసుకొని శ్రీసిటీ కార్మికుడి మృతి

సూళ్లూరుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న సిరాపురం దినేష్(26) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన సోమవారం చోటుచేసుకొంది. పోలీసుల సమాచారం మేరకు.. తిరుపతికి చెందిన దినేష్ శ్రీసిటీలో పనిచేస్తున్నాడు. ముగ్గురు స్నేహితులతో కలిసి సూళ్లూరుపేటలోని స్వతంత్రపురంలో గది అద్దెకు తీసుకొని ఉంటున్నారు. సోమవారం జనరల్ షిఫ్ట్ కావడంతో దినేష్ విధులకు వెళ్లలేదు. రాత్రి స్నేహితులు వచ్చి చూడగా గదిలో ప్యాన్‌కు ఉరేసుకొని కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టరేట్ ప్రదానం



శ్రీదేవి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ జువాలజీ పరిశోధకురాలు సి.శ్రీదేవి డాక్టరేట్ పొందారు. ఇంపాక్ట్ ఆఫ్ ఆర్సెనిక్ అండ్ కాడ్మియం ఆన్ హిస్టోపాథలాజికల్ అండ్ బయోకెమికల్ ఛేంజస్ ఇన్ లివర్ అండ్ కిడ్నీ ఆఫ్ మేల్ అల్బినో ర్యాట్స్ అంశంపై రిటైర్డు ప్రొఫెసర్ ఉషారాణి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

స్విమ్స్‌లో అధ్వానంగా తాగునీటి కొళాయిలు





పెథాలజీ విభాగం ముందు అధ్వానంగా తాగునీటి కొళాయి



తాగునీటి పైపులైన్ల వెనుక మూత లేకుండా ఉన్న మ్యాన్‌హోల్

తిరుపతి(వైద్యం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోగాలతో వైద్యం కోసం స్విమ్స్ ఆస్పత్రికి వచ్చే రోగులు దుర్గంధంతో నిండిన కొళాయిల్లో నీరు తాగాల్సిన పరిస్థితి నెలకొంది. ఓపీ చూపించుకునేందుకు వచ్చిన వారికి కనీసం 5-6 గంటల సమయం పడుతుంది. ఈ పరిస్థితుల్లో నీటి బాటిళ్లు తెచ్చుకోవాలన్నా అందుబాటులో దుకాణాలు ఉండవు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న నీటిని తాగాలంటే అక్కడ పారిశుధ్య పరిస్థితి చూస్తే తాగాలనిపించదు. గత్యంతరం లేక తాగాలంటే పరిసరాల నుంచి వచ్చే దుర్వాసనను భరించలేక ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. ప్రధానంగా ఓపీడీ భవనం వెనుక ఉన్న తాగునీటి కుళాయిలను ఆనుకునే డ్రైనేజీ ఉండడం, వాటికి సక్రమంగా మూతలు లేకపోవడంతో తీవ్రస్థాయిలో దుర్వాసన వెదజల్లుతున్నాయి. అక్కడ పాచిపట్టిన డ్రైనేజీల మీదుగానే తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేసి ఉన్నారు. అలాగే ఆస్పత్రి లోపల పెథాలజీ విభాగంలో ఉన్న మరో తాగునీటి కొళాయి వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. గత్యంతరం లేక రోగులు ఆ నీటినే తాగాల్సి వస్తోంది. తద్వారా రోగులు మరింత జబ్బుపడే అవకాశాలున్నాయి. స్విమ్స్ అధికారులు దీనిపై దృష్టి సారించాలని రోగులు కోరుతున్నారు.

శ్రీవారి సన్నిధి రోడ్డులో దుర్గంధం చూడతరమా?



రోడ్డుపైనే నిలిపి ఉంచిన స్కూలు వాహనాలు



రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు (ఇన్‌సెట్‌లో) పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

తిరుపతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : తిరుమల బైపాస్ రోడ్డు శ్రీవారి సన్నిధి పక్క వీధిలో తరుచూ మురుగు నీరు ప్రవహిస్తుండంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి డ్రైనేజీ లీక్ కావడంతో దుర్గంధంతో పాటు వాహనదారులు, పాదచారులు అటుగా వెళ్లలేకపోతున్నారు. పెద్ద సంఖ్యలో ఫ్లాట్లు కలిగిన స్వర్ణ అపార్ట్‌మెంటు వాసులు మల, మూత్రాలతో నిండిన మురుగును దాటి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. శ్రీవారి సన్నిధికి ఉత్తరం వైపు ట్రావెల్స్ కార్యాలయం ఉండడంతో రోడ్డుపైనే వాహనాలు పార్కు చేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మరికొంత ముందుభాగంలో స్కూల్ బస్సులు నిలిపివేయడం, సర్వీస్ అపార్ట్‌మెంట్లు పేరుతో వెలిసిన నివాస సముదాయాలకు వచ్చే వాహనాలు, రోడ్డుపక్కనే పశువులు కట్టేయడం వల్ల రోడ్డు ఇరుకుగా మారిపోతోంది. శ్రీవారి దర్శనానికి వచ్చే యాత్రికులు ఈ రోడ్డును చూసి ఇదేమి స్మార్ట్ సిటీ అనుకుంటున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బాల్య వివాహాల నివారణకు కృషి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆదివాసి అభివృద్ధి సంస్థ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ముద్రించిన బాల్య వివాహాల నిర్మూలన ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, డీఎంహెచ్‌వో శ్రీహరి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సూర్యనారాయణ, ఆదివాసి అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు చందమామల కోటయ్య, పరివర్తన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు అమరనాథ్, దొరస్వామి, రెడ్డెప్ప పాల్గొన్నారు.

పనుల్లో పురోగతి సాధించాలి

పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా నరేగా కింద మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎంపీడీవోలు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న క్యాటిల్‌షెడ్లు, సీసీరోడ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలన్నారు. వెనుకబడిన అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారి రామ్మోహన్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు శ్రీనివాసప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏసియన్ స్కూల్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ



చెస్ క్రీడాకారిణిని అభినందిస్తున్న దివాకర్‌రెడ్డి

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): థాయిలాండ్‌లో ఇటీవల జరిగిన ఏసియన్ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ 2024లో తిరుపతి క్రీడాకారిణి కె.ఈ.కె.బిల్వనిలయ సత్తాచాటింది. అండర్ 17 విభాగం బ్లిట్జ్ టీంలో గోల్డ్, బ్లిట్జ్ వ్యక్తిగతంలో బ్రాంజ్, స్టాండర్డ్ టీంలో బ్రాంజ్ మెడల్స్ సాధించి ఔరా అనిపించింది. సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమెను జిల్లా చెస్ అసోసియేషన్ చైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసమూరి, సీఏవో బాలాజీచౌదరి అభినందించారు.

రంగవిపంచిక పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆకాశవాణి రిటైర్డు రీజినల్ డైరెక్టర్ మల్లేశ్వరరావు రాసిన రంగవిపంచిక పుస్తకాన్ని ఎస్వీయూ వీసీ అప్పారావు ఆవిష్కరించారు. ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో స్టూడెంట్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. వీసీ అప్పారావు, విశ్రాంతాచార్యులు గార్లపాటి దామోదర నాయుడు, ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు, రచయిత రాసాని, పుస్తక రచయిత మల్లేశ్వరరావు తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ తరంలో పుస్తక పఠనం తగ్గిందన్నారు. పుస్తక పఠనం ద్వారా యువతలో సామాజిక అవగాహన పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కల్చరల్ కో-ఆర్డినేటర్లు వివేక్, కల్యాణ్, రచయితలు కొత్వాలు అమరేంద్ర, షణ్ముగం, తోట వెంకటేశ్వర్లు, పేరూరు బాలసుబ్రహ్మణ్యం, కృష్ణస్వామిరాజు పాల్గొన్నారు.

వేద సారమే తిరుప్పావై - చిన్నజీయర్‌స్వామి



కార్యక్రమంలో పాల్గొన్న చిన్నజీయర్ స్వామి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేదాల సారమే తిరుప్పావై అని చిన్నజీయర్‌స్వామి పేర్కొన్నారు. అన్నమాచార్య కళా మందిరంలో సోమవారం సాయంత్రం తిరుప్పావై ప్రవచన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. శ్రీవారి వైభవాన్ని పాశురాల ద్వారా వ్యాప్తి చేసిన 12 మంది ఆళ్వార్లలో గోదాదేవి ఒకరని చెప్పారు. గోదాదేవి అనన్యమైన భక్తి భావనతో శ్రీవారిని కీర్తిస్తూ పాశురాలు రచించారని కొనియాడారు. ధనుర్మాసంలో తిరుప్పావై పారాయణం చేస్తే పాపాలు నశించి పుణ్యం సిద్ధిస్తుందన్నారు. ప్రవచనకర్త చక్రవర్తి రంగనాథన్ మాట్లాడుతూ సూర్యుడు ధనరాశిలో ప్రవేశించడాన్నే ధనుర్మాసం అంటారని తెలిపారు. ఈ మాసంలో బ్రహ్మ ముహూర్తంలో భగవంతుడిని ఆరాధిస్తే మంచి ఫలితం వస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ వి.జె.లక్ష్మి రచించిన అనలిటికల్ స్టడీ ఆఫ్ మ్యూజిక్ ఆఫ్ తిరుప్పావై పాశురమ్స్ పుస్తకాన్ని చిన్నజీయర్ స్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు అధికారి రాజగోపాలరావు, భక్తులు పాల్గొన్నారు.

యూనివర్సిటీలు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి



ఎడ్యుకేషన్ ఫేర్‌ను ప్రారంభిస్తున్న రవినాయుడు

తిరుపతి(విద్య), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు కోరారు. ఫౌండేషన్ ఫర్ యూత్ అడ్వాన్స్‌మెంట్ ఆధ్వర్యంలో రాజ్‌పార్క్ హోటల్లో సోమవారం నిర్వహించిన రెండవ రోజు ఎడ్యుకేషన్ ఫేర్‌ను ఆయన ప్రారంభించారు. విశ్వవిద్యాలయాలలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు, క్రీడాకారులకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని కోరారు. విద్యార్థులు ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకుని రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేసే యజ్ఞంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అపోలో, గీతం, జైన్, వినాయక మిషన్, ఎస్ఆర్ఎం, సెంచూరియన్, దయానంద సాగర్ తదితర 20కి పైగా విశ్వవిద్యాలయాల ప్రతినిధులు, నిర్వాహకులు తూపల్లి నందకిషోర్, మల్లు వాసుదేవరెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్, టీడీపీ నేత మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఫ్యాషన్ డిజైన్‌పై పట్టుసాధించాలి



కుట్టుమిషన్లు అందిస్తున్న పీడీ శోభన్‌బాబు

మంగళం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ మహిళలు ఫ్యాషన్ డిజైన్‌పై పట్టుసాధిస్తూ ఆర్థిక చైతన్యవంతులు కావాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు పేర్కొన్నారు. సోమవారం యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ఏకంవారి ఆర్థిక సహకారంతో సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో తిరుపతి గ్రామీణ పరిధిలోని సిర్డ్ సంస్థల ద్వారా మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. జన శిక్షణా సంస్థ డైరెక్టర్ మోహన్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాస్ సంస్థ అధ్యక్షుడు జ్ఞానశేఖర్ రెడ్డి, సిర్డ్ సంస్థ కార్యదర్శి హేమశేఖర్, డీఆర్డీఏ ఏపీడీ ప్రభావతి, ఏపీడీ నాగేశ్వరరావు, సిర్డ్ సంస్థ వాలంటీర్స్ పాల్గొన్నారు.

19 నుంచి దుబాయ్‌లో ఉప్పలదడియం అవధానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన అవధాని ఉప్పలదడియం భరత్‌కుమార్‌శర్మ త్వరలో దుబాయ్‌లో అవధాన కార్యక్రమం చేపట్టనున్నారు. గురువు వద్దిపర్తి పద్మాకర్‌తో కలిసి ఈ నెల 19 నుంచి 26వ తేదీ దాకా దుబాయ్‌లో అవధానం నిర్వహించనున్నారు.

నత్తనడకన ఇండోర్ స్టేడియం పనులు

శాప్ చైర్మన్ అసహనం

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో చేపడుతున్న ఖేలో ఇండియా మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులు నత్తనడకన సాగుతుండడంపై శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు అసహనం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, యూనివర్సిటీ, శాప్ సంయుక్త నిధులతో నిర్మిస్తున్న స్టేడియం పనులను వీసీ వి.ఉమాతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. నిధులు పూర్తి స్థాయిలో మంజూరు చేసినా కాంట్రాక్టర్ పనితీరుపై అసంతృప్తి చెందారు. ఉడెన్ కోర్టు, లైటింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఖోఖో కోర్టుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రిజిస్ట్రార్ ఎస్.రజనీ, పీఈడీ ఎస్.సరోజినీ, డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్‌యాదవ్, కొట్టె హేమంత్‌రాయల్, రంజిత్ పాల్గొన్నారు.

చెత్తబుట్టల పంపిణీ



బుట్టలు అందిస్తున్న సచివాలయ సిబ్బంది, టీడీపీ నేతలు

తిరుపతి అర్బన్, డిసెంబరు 16 : మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ వాసులకు సోమవారం చెత్తబుట్టలు పంపిణీ చేశారు. స్వచ్ఛ భారత్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వరకాలనీ, గిరిప్రసాద్‌కాలనీల వాసులకు ప్రతి ఇంటికీ ఒకటి చొప్పున ఉచితంగా అందించారు. సచివాలయ కార్యదర్శి జయశంకర్, టీడీపీ నాయకులు జడ భాస్కర్‌రెడ్డి, వేమూరు గోపాల్‌యాదవ్, అల్లాబాషా, మణి, కేశవనారాయణ, సుబ్బమ్మ, చాణిక్య, నాగభూషణం, దామోదరనాయుడు పాల్గొన్నారు.

అధ్వానంగా మిట్టగాంధీపురం రోడ్డు



మిట్టగాంధీపురం మార్గంలో రోడ్డు

తిరుపతి అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి సచివాలయ పరిధిలోని మిట్టగాంధీపురం మార్గం అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిల్వ ఏర్పడింది. మిట్టగాంధీపురానికి డ్రైనేజీ సిస్టం లేకపోవడంతో వర్షపు నీటితో కలిసి మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. గుంతలు ఏర్పడి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను సచివాలయ కార్యదర్శి ఎన్.మురళికి విన్నవించారు. సోమవారం ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమేంద్రతో కలిసి రోడ్డును పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులకు చర్యలు చేపట్టారు. టీడీపీ నాయకులు ఈశ్వరయ్య, మాతయ్య, జడా భాస్కర్ రెడ్డి, అల్లాబాషా, వేమూరు గోపాల్‌యాదవ్, గురవయ్య, పార్వతమ్మ పాల్గొన్నారు.

నేడు సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి జయంతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి 136వ జయంతిని మంగళవారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు అన్నమాచార్య కళా మందిరంలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. శ్వేత ముందు ఉన్న సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పిస్తారు.



ఏటీసీ దాకా క్యూలైన్

సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో షెడ్లలు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ ఏటీసీ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.


శనివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.47 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,160

తలనీలాలు సమర్పించినవారు : 22,724

చాయైనా.. బతుకైనా.. మట్టిలోనే..!

- 'పడమటి గాలి' నాటకంలో ఆకట్టుకున్న రాంకోటి ప్రతిన
- మాయోడి పాత్రలో ఆకట్టుకున్న రిటైర్డు ఐఏఎస్ బలరామయ్య





తన చాయైనా.. బతుకైనా.. మట్టిలోనే అని పిడికిట మట్టి సాక్షిగా రైతు రాంకోటు చేసిన శపథం.. 'పడమటి గాలి' నాటకంలో ఉద్వేగపూరితంగా కనిపించింది. తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో పాటిబండ్ల ఆనందరావు రచించిన ఈ నాటకాన్ని సోమవారం సాయంత్రం తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించారు. మాయోడి పాత్ర ద్వారా రిటైర్డు ఐఏఎస్ అధికారి బలరామయ్య అందరినీ ఆకట్టుకున్నారు. ధ్వంసమైపోతున్న గ్రామీణ జీవనాన్ని దృశ్యమానం చేసిందీ నాటకం. ఈ నాటకంలో దళారీ పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రిటైర్డు ఐఏఎస్ అధికారి బలరామయ్య ఈ పాత్రను పోషించారు. మల్టీనేషనల్ కంపెనీ ఏర్పాటు కోసం అవసరమైన భూ సేకరణలో జరిగిన సంఘర్షణ ఈ నాటకానికి ఇతివృత్తం. 50 ఎకరాల భూమి అవసరమవుతుంది. ఓ రైతుకున్న 4 ఎకరాల భూమిని ఎలాగైనా దక్కించుకోవాలని గ్రామంలోని దళారీ ద్వారా ఎత్తుగడ వేస్తారు. కొడుకు ద్వారానూ పన్నాగం పన్నుతారు. కడకు రైతును తన కొడుకు చేతులారా కడతేర్చడానికి కుట్ర చేస్తారు. ఎన్ని కుయుక్తులు పన్నినా నమ్ముకున్న భూమిని అమ్ముకోని రైతు రాంకోటు ఆత్మస్థైర్యం ఈ నాటకానికి పరాకాష్టగా నిలుస్తుంది. ఈ సందర్భంగా రచయిత పాటిబండ్ల ఆనందరావు మాట్లాడుతూ.. 25 ఏళ్లకుపైగా 150 ప్రదర్శనలు నిర్వహించినట్టు తెలిపారు. వేగవంతమైన జీవన శైలిని దృష్టిలో ఉంచుకొని రెండు గంటల నిడివితో ఈ నాటకాన్ని ప్రదర్శించినట్టు తెలిపారు. తిరుపతిలో ఇప్పటికీ ఈ నాటకానికి ఇంత ఆదరణ ఉండటం తనకు సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. నాటక ప్రదర్శనకు ముందు తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షుడు సాకం నాగరాజు, తమటం రామచంద్రారెడ్డి, నాదెండ్ల శ్రీమన్నారాయణ తదితరులు మాట్లాడారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

ప్రతి అర్జీనీ గడువులోపు పరిష్కరించండి

- కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 150 వినతులు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అందజేసే అర్జీలను గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 150 అర్జీలు అందగా, అందులో భూ సమస్యలపైనే 94 ఉన్నాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ వెంకటేశ్వర్

మౌలిక వసతులు కల్పించండి



కల్యాణ వెంకటేశ్వరపురం గ్రామస్తులు

'పుత్తూరు మండలం నేసనూరు గ్రామ పంచాయతీ కల్యాణ వెంకటేశ్వరపురంలో ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోండి.. పంట నష్టపరిహారం కూడా ఇప్పించండి. రైతులకు డీకేటీ పాసుపుస్తకాలు, నివాస భూముల కోసం పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయండి' అంటూ గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు.

పారా మెడికల్ రిజిస్ట్రేషన్ చేయండి



పారా మెడికల్ రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతున్న విద్యార్థులు

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో బీఎస్సీ, ఎంఎల్‌టీ కోర్సులు పూర్తి చేశామని, కళాశాల అధికారుల తప్పిదం వల్ల పారా మెడికల్ రిజిస్ట్రేషన్ కల్పించలేదని విద్యార్థులు దీప్తి, భూలక్ష్మి, చందు, పల్లవి, రమ్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పారా మెడికల్ రిజిస్ట్రేషన్, ఉపాధి కల్పించాలని అభ్యర్థించారు.

ప్రత్యామ్నాయ స్థలం చూపండి

తిరుచానూరు రోడ్డులోని శ్రీనివాస కల్యాణ మండపాల సమీపంలో హథీరాంజీ మఠం స్థలంలో చేపలు విక్రయించి జీవనం సాగిస్తున్నామని, మున్సిపల్ అధికారులు అక్కడ వ్యాపారం చేయరాదని బెదిరిస్తున్నారని, ప్రత్యామ్నాయం చూపాలని వ్యాపారులు కోరారు. ఈ మేరకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఏఐటీయూసీ నేతలు శ్రీనివాసులు, శివకుమార్, బాలాజీ, విజయ్, గురవయ్య పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న చేపల వ్యాపారులు

రెండు బార్లకు ఈ టెండర్ల ఆహ్వానం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీల పరిధిలో రెండుబార్లకు ఈ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 1 నుంచి వచ్చే ఏడాది ఆగస్టు 31 వరకు తొమ్మిది నెలల కాలానికి సంబంధించి బార్లు నిర్వహించేందుకు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. 23న పరిశీలించి లాటరీ ద్వారా 24న అర్హులను ఎంపిక చేసి, దుకాణాలు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం గూడూరు ఏఈఎస్ హరాహ్రిణి 9440902265, నాయుడుపేట ఎక్సైజ్ సీఐ 9440902516, సూళ్లూరుపేట ఎక్సైజ్ సీఐ 9440902515, తిరుపతి కంట్రోలు రూము ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 9603274401ను సంప్రదించాలని కోరారు.

అసైన్‌మెంట్ భూముల విషయమై వివాదం

స్వాధీనానికి అధికారుల చర్యలు ● కుమ్మరిపాళెంలో ఇరువర్గాల ఘర్షణ



ఆక్రమణదారులతో ఘర్షణ పడుతున్న గ్రామస్తులు

చిట్టమూరు, డిసెంబర్ 16(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు అసైన్‌మెంట్ పట్టా ఇచ్చిన భూముల విషయమై నెలకొన్న వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. చిట్టమూరు మండలం బురదగాలి పంచాయతీ పరిధిలోని కుమ్మరిపాళెం గ్రామంలో సర్వే నెంబర్ 16లో 9ఎకరాల భూమిని గిరిజనులకు అసైన్‌మెంట్ పట్టాలిచ్చారు. అయితే గిరిజనులు చాలా ఏళ్లుగా స్థానికంగా నివాసం లేకపోవడంతో కోట మండలానికి చెందిన వైసీపీ నేత దగ్గర పనిచేసే హరికృష్ణ అనే వ్యక్తి సదరు భూములను స్వాధీనం చేసుకున్నాడు. దీనిపై కుమ్మరిపాళెం గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తాను గిరిజనుల వద్ద భూములను కొనుగోలు చేశానని హరికృష్ణ చెప్పగా, ఇందుకు గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. దీంతో సదరు భూముల్లోకి ఎవరూ ప్రవేశించవద్దంటూ రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంగా హరికృష్ణ వివాదాస్పద భూముల్లో వరి పంట సాగు చేశారు. దీంతో ఆ భూములను స్వాధీనం చేసుకొనేందుకు రెవెన్యూ అధికారులు, పోలీసులు సోమవారం కుమ్మరిపాళెం గ్రామానికి చేరుకున్నారు. తాను గిరిజనుల వద్ద భూములను కొనుగోలు చేశానని హరికృష్ణ అధికారులకు వివరించారు. అయితే అసైన్‌మెంట్ పట్టా పొందిన వారే భూములను సాగు చేసుకోవాలని, లేదంటే స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఇంతలో గ్రామస్తులు జోక్యం చేసుకుని గిరిజనులు భూములను అమ్మలేదని, ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని చెప్పారు. దీంతో గ్రామస్తులకు హరికృష్ణ, అతని సోదరుడు రామ్ కుమార్ మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఇరువర్గాలకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా, వివాదాస్పద భూములపై సర్వే చేయించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకుంటామని రెవెన్యూ అధికారులు చెప్పారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 90 వినతులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 90 వినతులు వచ్చాయి. అదనపు ఎస్పీలు నాగభూషణం, రవిమనోహరాచారి, ఎస్పీ సీఐ శ్రీనివాసులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని ఆయా పోలీసు స్టేషన్లకు పంపి, పరిష్కరించాలని ఆదేశించారు.



ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న ఎస్పీ సుబ్బరాయుడు

ఎయిర్‌పోర్టులో శ్రీవాణి కౌంటర్ల పరిశీలన



రేణిగుంట/ తిరుమల, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): రేణిగుంట ఎయిర్‌పోర్టులోని శ్రీవాణి టికెట్ల కౌంటర్లను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం పరిశీలించారు. భక్తుల నగదు చెల్లింపులు, టికెట్లు, రసీదు జారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రోజువారీ వివరాలపై కౌంటర్ సిబ్బందిని విచారించారు. టికెట్లపై పలువురు భక్తుల అభిప్రాయాలు స్వీకరించారు.

ఆటో దొంగలు

జల్సాల కోసం చోరీలు.. ఇద్దరి అరెస్టు



ఆటోలతో పాటు నిందితులను చూపుతున్న క్రైం పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరూ మంచి మిత్రులు. పదో తరగతి వరకు చదువుకున్నారు. జల్సాలు, వ్యసనాలకోసం దొంగతనాల వైపు అడుగులు వేశారు. కడప, తిరుపతి జిల్లాల్లో ఆటోలను దొంగలించి అమ్మే.. ఈ ఇద్దరిని తిరుపతి క్రైం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. క్రైం డీఎస్పీ రమణకుమార్ తెలిపిన ప్రకారం.. స్నేహితులైన రేణిగుంట మండలం వేణుగోపాలపురానికి చెందిన దొడ్డి కార్తీక్, తిరుపతి సింగాలగుంటకు చెందిన కె.లలితకుమార్ చెడు అలవాట్లకు బానిసలయ్యారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో తొలుత మేకలను దొంగతనం చేసి సంతల్లో విక్రయించి ఆ డబ్బును పంచుకుని విలాసాలకు ఖర్చు పెట్టేవారు. కొంత కాలంగా కడప జిల్లా ఓబులవారిపల్లి, తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆటోలను దొంగలించి విక్రయించే వారు. ఆ డబ్బుతో జల్సాలు చేసేవారు. ఇటీవల కొందరు బాధితుల ఫిర్యాదు మేరకు క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ రమణకుమార్, సీఐ పెద్దరత్తయ్య, ప్రకాష్‌కుమార్, ఎస్ఐ ప్రదీప్‌కుమార్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ బసవరాజు, కానిస్టేబుళ్ళు నాగరాజు, ప్రసాద్, మోహన్‌తో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆటో దొంగలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పద రీతిలో తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వీరు ఆటోలు దొంగిలించినట్లు చెప్పడంతో వారి నుంచి రూ.6 లక్షల విలువైన నాలుగు ఆటోలను సీజ్ చేశారు.

అమ్మో.. పులి!

- వేద వర్సిటీలో భయాందోళన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని వేద విశ్వవిద్యాలయంలో పులి సంచారం ఆందోళన కలిగిస్తోంది. రెండు వారాల క్రితం పద్మావతి హాస్పిటల్ - వేద వర్సిటీ లైబ్రరీ మధ్య రాత్రి 9 గంటల సమయంలో పులి కనిపించింది. పులిని చూసిన విద్యార్థులు భయాందోళనతో పరుగులు తీశారు. మూడు రోజుల ముందు మరోసారి వేద వర్సిటీకి అలిపిరి రోడ్డు వైపు ఉన్న ఆర్చి వైపు నుంచీ ప్రవేశించిన పులి ఏడీ బిల్డింగ్ సమీపానికి వచ్చినట్టు తెలుస్తోంది. అక్కడ్నుంచి జింకను తరుముకుంటూ అకడమిక్ బిల్డింగ్ వైపు పులి వెళ్లినట్టు విద్యార్థులు, సెక్యూరిటీ సిబ్బంది గమనించినట్టు సమాచారం. ఈ విషయాన్ని ఫారెస్టు అధికారులకు యూనివర్సిటీ నుంచీ సమాచారం అందించారు. దీంతో ఫారెస్టు అధికారులు సోమవారం యూనివర్సిటీకి వచ్చి పరిస్థితిపై ఆరా తీసినట్టు తెలుస్తోంది. పులి సంచారం నేపథ్యంలో విద్యార్థులు, ఉద్యోగులు జాగ్రత్తగా ఉండాలని ఫారెస్టు అధికారులు సూచించారు. రాత్రి వేళల్లో అత్యవసరమైతే తప్ప వెలుపలకు రావొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. సెక్యూరిటీ సిబ్బంది గస్తీ కాస్తున్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



జస్టిస్ భవాని ప్రసాద్ - జస్టిస్ వేలుమణి

తిరుమల, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఉడిపిలోని చిత్తాపూర్ మఠాధిపతి విద్యేంద్ర తీర్థ స్వామి, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి భవానిప్రసాద్, కలకత్తా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వేలుమణి, తమిళనాడు మాజీ సీఎం పళనిస్వామి సతీమణి రాధ ఉన్నారు.



విధ్యేంద్రతీర్థ స్వామి - రాధ

పాపవినాశనం వద్ద ప్రత్యేకంగా పెట్రోలింగ్



సుదర్శన్‌రెడ్డి

మంగళం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల పాపవినాశనం వద్ద అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న దుకాణాలను అడ్డుకునేందుకు ప్రత్యేక పెట్రోలింగ్ బృందం ఏర్పాటు చేసినట్లు తిరుపతి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతి విలేకరితో మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం పాపవినాశనం స్థల విశిష్టతను తెలుపుతూ ఏర్పాటు చేసిన బోర్డును కొందరు తొలగించారని, మళ్లీ ఏర్పాటు చేయించి, దాన్ని ఎవరు తొలగించారనే దానిపై విచారణ చేపట్టామని పేర్కొన్నారు. బోర్డు కటింగ్ చేయడానికి కాంట్రాక్టర్‌కు అప్పగించిన జనరేటర్‌ను వినియోగించారని గుర్తించామని, విచారణ పూర్తయిన తర్వాత బాధ్యులపై వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ ప్రచారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రత్యేక పెట్రోలింగ్ బృందాన్ని నిఘా ఉంచామని పేర్కొన్నారు.

నగరి కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా

లారీ సహా 19 టన్నుల బియ్యం సీజ్ ● ఎస్పీ ప్రత్యేక బృందం దాడుల్లో పట్టుబడిన వైనం



పట్టుబడిన రేషన్ బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌లో అన్‌లోడ్ చేస్తున్న కూలీలు

పుత్తూరు అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరి కేంద్రంగా రేషన్ బియ్యం పక్కరాష్ట్రాలకు అక్రమ రవాణా అవుతోంది. గతంలో పుత్తూరు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ బియ్యం పక్కదారి పట్టించి రూ.2.50 కోట్ల మేర అవినీతికి పాల్పడిన సీఎస్ డీటీ జైలులో ఊచలు లెక్కపెడుతున్నాడు. అయినా వ్యాపారుల్లో మార్పు రావడం లేదు. నగరి, పుత్తూరు పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే జిల్లా ఎస్పీ పర్యవేక్షణలోని ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. అర్ధరాత్రి వేళ రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోకుండా అడ్డుకుంది. ప్రత్యేక బృందం రంగ ప్రవేశంతో బియ్యం అక్రమ వ్యాపారుల వెన్నులో వణుకుపుడుతోంది. నగరి నుంచి పుత్తూరు మీదుగా కర్ణాటక రాష్ట్రానికి తరలిపోతున్న రూ.8.62 లక్షల విలువైన 19 టన్నుల రేషన్ బియ్యం సోమవారం పట్టుబడింది. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షణలోని ప్రత్యేక బృందం ఈ అక్రమ రవాణాను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. అనంతరం పట్టుబడిన బియ్యం సహా లారీని ప్రత్యేక బృందం పుత్తూరు పోలీసులకు స్వాధీనం చేసింది. సోమవారం వేకువజామున 3 నుంచి 4 గంటల మధ్య పుత్తూరు - తిరుపతి జాతీయ రహదారిలోని పీఆర్ మంగళం సమీపంలోని రాజస్థాన్ దాబా వద్ద ప్రత్యేక బృందం కాపుకాసింది. ముందస్తు సమాచారం మేరకు లారీని ఆపి తనిఖీ చేసింది.లారీలో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు నిర్ధారించుకుంది. నగరికి చెందిన బియ్యం వ్యాపారి పొడుగు బాలా, పొన్నుస్వామి, గణేష్ బియ్యాన్ని తరలిస్తున్నట్టు విచారణలో తేలింది. నగరి దేశమ్మ ఆలయ సమీపం నుంచి 50 కిలోల చొప్పున 375 బస్తాలను లారీలో లోడ్ చేయించినట్లు డ్రైవర్ యువరాజ్(31) తెలిపారు. కరాటక రాష్ట్రం బంగారుపేట ఆర్కే రైస్ మిల్‌కు ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. కేసు నమోదు చేసిన పోలీసలు పట్టుబడిన బియ్యాన్ని ఎంఎల్‌సి పాయింట్‌కు తరలించారు. లారీని సీజ్ చేశారు. బియ్యం అక్రమ రవాణాకు పాల్పడిన వ్యాపారులను, రైస్ మిల్లు యజమానికి అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు.

తిరుమలలోనూ ఇకపై హెల్మెట్ తప్పనిసరి

అమలుపై అధికారుల కసరత్తు

తిరుమల, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమలలోనూ ఇకపై ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ అధికారులు నిర్ణయించారు. ప్రమాదాల నివారణ కోసం ఇప్పటికే కొన్నేళ్లుగా తిరుమల మొదటి, రెండో ఘాట్‌లో హెల్మెట్ తప్పనిసరి నిబంధన కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా, తిరుమలలో తిరిగే ద్విచక్రవాహనదారులకు కూడా హెల్మెట్ తప్పనిసరి చేయాలని పోలీసు అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం కొన్ని ప్రాంతాల్లో భక్తులు, స్థానికులు, వ్యాపారులు, ఉద్యోగులకు హెల్మెట్ పెట్టుకుని డ్రైవ్ చేయాలని సూచించారు. ఇక, అతి తక్కువ పరిధిలో ఉండే తిరుమలలో ద్విచక్రవాహనాలపై వేగంగా వెళ్లే అవకాశం ఉండదు. అలాంటప్పుడు తిరుమలలో హెల్మెట్ నిబంధన అవసరమా అనే చర్చ మొదలైంది. అయితే ద్విచక్రవాహనదారుల భద్రత కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సూచనల మేరకు ఈ నూతన నిర్ణయాన్ని అమలుచేయాలనే ఆలోచన చేస్తున్నట్టు పోలీసులు చెబుతున్నారు.

సీమ పందుల పెంపకంతో వ్యాపారవేత్తలుగా ఎదగాలి



జ్యోతి వెలిగిస్తున్న డీఈ శోభామణి, డీఆర్ శ్రీలత

తిరుపతి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ పద్ధతుల ద్వారా వాణిజ్య సరళిలో సీమపందుల పెంపకాన్ని చేపట్టి వ్యాపారవేత్తలుగా ఎదగాలని వెటర్నరీ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత తెలిపారు. 'శాస్త్రీయ పద్ధతుల్లో సీమపందుల పెంపకం' అంశంపై రైతులు, యువతకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. సీమపందుల పెంపకం ద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవడంతో పాటు ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ శోభామణి ఆకాంక్షించారు. సీసీవీఈసీ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.సుజాత, ఏఐసీఆర్‌పీ ప్రధాన శాస్త్రవేత్త కల్యాణచక్రవర్తి, డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య

- బంగారు నగలు అపహరించిన నిందితులు
- పాడిపేటలో కలకలం



హత్యకు గురైన జీవరత్నమ్మ

తిరుచానూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పాడిపేటలో ఓ వృద్ధురాలు హత్యకు గురైన ఘటన సోమవారం సాయంత్రం వెలుగుచూసింది. తిరుచానూరు సీఐ సునీల్ కుమార్ కథనం మేరకు.. పాడిపేట మాజీ సర్పంచ్ దివంగత గణేష్‌శెట్టి భార్య జీవరత్నమ్మ(63) తన కుమార్తె లలితతో కలిసి నివాసం ఉంటోంది. నారాయణవనంలోని ఐఆర్‌డీఏస్ సంస్థలో లలిత ఉద్యోగిని. సోమవారం ఉదయం ఆమె విధులకు వెళ్లారు. ఇద్దరు మనవరాళ్లు కళాశాలకు వెళ్లారు. జీవరత్నమ్మ ఒకరే ఇంట్లో ఉన్నారు. మధ్యాహ్నం పక్కనే దుకాణానికి మిద్దెపైనుంచి దిగి వచ్చారు. ఆ తరువాత ఏం జరిగిందో తెలియదు. సాయంత్రం 5.30 గంటలకు విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన లలిత.. మొదటి అంతస్తులో తలుపులు తెరచివుండటం, బెడ్‌పై విగతజీవిగా పడి ఉన్న తల్లిని చూసి నిశ్చేష్టురాలయ్యారు. సమాచారం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్, క్లూస్‌టీం చేరుకున్నారు. మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి మొదటి అంతస్థుకు చేరుకుని జీవరత్నమ్మ నోటిని గుడ్డతో అదిమిపెట్టి ఊపిరి ఆడకుండా హత్య చేసి మెడలో ఉన్న వంద గ్రాముల బంగారు నగలను లాక్కెళ్లినట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. హత్య కేసుగా నమోదు చేసి జీవరత్నమ్మ మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

14 మంది వ్యవసాయ కూలీలకు అస్వస్థత



ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు కూలీలు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వరినాట్లు వేసేందుకు వచ్చిన కూలీలు అస్వస్థతకు గురయ్యారు. దీనికి కలుషిత ఆహారం కారణమని భావిస్తున్నారు. ఈ సంఘటన సోమవారం వెంకటగిరి మండలం చెలికంపాడు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. నాగరాజు అనే రైతు పొలంలో వరి నాట్లు వేసేందుకు వచ్చిన కూలీలు మధ్యాహ్నం వరకు నాట్లు వేశారు. వీరికి పొలం వద్దే యజమాని మధ్యాహ్నం ఆహారాన్ని వండించారు. అందరూ కలిసి ఈ ఆహారాన్ని తిన్నారు. కొంతసేపటికి కొంతమంది కూలీలకు వాంతులు, విరోచనాలు అయ్యాయి. దీంతో 14 మంది కూలీలను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి సిబ్బంది సకాలంలో వైద్య సేవలు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని కూలీలు ఆరోపిస్తున్నారు. దీంతో వీరు ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. కలుషిత ఆహారమే దీనికి కారణమని భావిస్తున్నారు. కాగా, వెంకటగిరి ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు, సిబ్బంది పనితీరు దారుణంగా ఉందని రైతులు కృష్ణయ్య, రమణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. వైద్యం కోసం వచ్చిన బాధితులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ డీహెచ్ఎస్ ఆనంద మూర్తితో ఫోన్‌లో మాట్లాడారు.

చెరువులను అభివృద్ధి చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలిపొందినవారు వారి పరిధిలోని చెరువుల అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఎన్నికైనా అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గ పరిధిలో 105 సాగునీటి సంఘాల అభ్యర్థులు ఏగ్రీవంగా ఎన్నికవడం ఆనందదాయకమన్నారు. ఎన్నికైనా అభ్యర్థులు తమ పరిధిలోని చెరువులను అభివృద్ధి చేయాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సు

ఏర్పేడు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. మేర్లపాకలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మండలస్థాయి అధికారులు గ్రామాలకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. అనంతరం 28మంది రైతులు వివిధ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలను అందించారు. తహసీల్దారు భార్గవి, డీటీ రోజారమణి, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు పొన్నారావు, శివారెడ్డి, నరసింహులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా

ఏర్పేడు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి లారీ బోల్తా పడింది. ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపిన వివరాలు... విజయవాడ నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఖాళీ లారీ సీతారాంపేట ఎఫ్‌సీఐ గోదాము వద్ద బోల్తా పడిందన్నారు. డ్రైవర్ వాహనం నిర్లక్ష్యంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందన్నారు. డ్రైవర్ మహేష్(30) గాయపడ్డాడన్నారు. 108 అంబులెన్స్‌లో తిరుపతికి తరలించామన్నారు. అంబులెన్స్ సిబ్బంది తెలిపిన సమాచారం మేరకు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు సీఐ తెలిపారు.

పుత్తూరు వార్తలు

భూములకు పరిహారం అందించండి


క్షేత్రస్థాయి పరిశీలనలో తహసీల్దార్

పుత్తూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): చెన్నై - తిరుపతి జాతీయ రహదారి విస్తరణలో నష్ట పరిహారం అందలేదని స్థలాలు కోల్పోయిన బాధితులు రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు. పరమేశ్వర మంగళంలో జరిగిన సదస్సులో ఈ మేరకు ఫిర్యాదు చేయగా స్పందించిన తహసీల్దార్ వెంకటేశ్వర్లు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. గ్రామ కంఠాన్ని రీసర్వే చేయాలని సర్వేయర్లను ఆదేశించారు. ఈ సదస్సులో 58 ఫిర్యాదులు అందగా, జాతీయ రహదారి బాధితులు 19 అర్జీలు సమర్పించారు. ఆర్ఓఆర్ 19, ఇళ్లపట్టాలు 18, సర్వేకు 2 వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆర్ఐ తిరుమలసాయి, మండల సర్వేయర్ శేషమరాజు పాల్గొన్నారు.

స్కిల్‌హబ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పుత్తూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(స్కిల్‌హబ్) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. ఈనెల 21నుంచి ప్రారంభం కానున్న కోర్సుల్లో చేరే అభ్యర్థులు టెన్త్, డిగ్రీ అర్హత కలిగి వుండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆధార్‌కార్డు, మార్కుల జాబితా, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు రసూల్ నెం.6300954441లో సంప్రదించాలని తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 47 మద్యం కేసుల పరిష్కారం

- రూ.2.30 లక్షల జరిమానా వసూలు

పుత్తూరు అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో 47 మద్యం కేసులు పరిష్కారమయ్యాయని పుత్తూరు ఎక్సైజ్ శాఖ సీఐ మురళీ మోహన్ పేర్కొన్నారు. ఇందుకు రూ2.08 లక్షల జరిమానాను నిందితులు చలానా రూపంలో చెల్లించినట్లు తెలిపారు. ఎక్సైజ్ శాఖ దాడుల్లో పట్టుబడిన మద్యం అక్రమ విక్రయదారులపై కేసులు నమోదయ్యాయి. పది లీటర్లకు లోబడి పట్టుబడిన మద్యం కేసులను మాత్రమే లోక్ అదాలత్‌లో పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు సీఐ చెప్పారు. ఈక్రమంలో 2023 నుంచి నమోదైన కేసులను ఈనెల 14న శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో పెట్టినట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం ఎమ్మార్పీ ఆధారంగా మూడు రెట్లు జరిమానా విధించి నిందితుల నుంచి చలానా రూపంలో చెల్లింపులు చేయించామన్నారు. ఛార్జ్ షీట్ మొదలు హియరింగ్, క్రాస్ ఎగ్జామిన్, వాయిదాలకు హాజరు వంటి పరిణామాలు లోక్ అదాలత్ ద్వారా అధిగమించినట్లు నిందితులు చెబుతుండటం గమనార్హం.

శాస్త్రోక్తంగా మహా రుద్రాభిషేకం



వడమాలపేట, డిసెంబరు 16(ఆంధ్ర జ్యోతి): మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా పట్టణంలోని భవానీ శంకర ఆలయంలో మహా రుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సోమ వారం వేకువ జామున మహాలింగానికి వేదమంత్రాలతో అభిషేకం నిర్వహించారు. లింగాన్ని పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించి మంగళ హారతులిచ్చారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చీమలవారి కాజ్‌వేకు తాత్కాలిక మరమ్మతులు


కాజ్ వే పరిశీలిస్తున్న డీఈ, నాయకులు

వడమాలపేట, డిసెంబరు 16(ఆంధ్ర జ్యోతి): పట్టణానికి సమీపంలోని చీమల వారి వంక కాజ్‌వే, పాదిరేడు రోడ్డులోని పెద్ద చెరువు వరవ కాలువకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టనున్నట్టు ఆర్ అండ్ బీ డీఈ అమర్నాథ రెడ్డి చెప్పారు. సోమవారం చీమలకుర్తి కాజ్‌వేను పరిశీలించారు. ఎస్ఐ ధర్మారెడ్డి, టీడీపీ నాయకులు ధనంజయులు నాయుడు, ఢిల్లీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడకి రుద్రాభిషేకం



పుత్తూరు టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రామలింగేశ్వర ఆలయంలో రుద్రాభిషేకం జరిగింది. ఉదయం స్వామి వారికి క్షీర, గంధ, నారికేళ జలాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

బార్‌కు దరఖాస్తుల స్వీకరణ

నాయుడుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బార్ అండ్ రెసారెంట్‌కు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైనట్లు ఎక్సైజ్ సీఐ అరుణ కుమారి తెలిపారు. ఔత్సాహికులు ఈ నెల 16నుంచి 22వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చుఆన్నరు. 23వ తేదీన దరఖాస్తుల పరిశీలన, 24న జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో డ్రా తీసి లైసెన్స్ కేటాయించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ సూచించారు.

18న ద్విచక్ర వాహనం వేలం

వెంకటగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం కేసులో పట్టుబడిన ద్విచక్ర వాహనాన్ని ఈ నెల 18వ తేదీన వేలం వేయనున్నట్లు వెంకటగిరి ఎక్సైజ్ సీఐ సూర్యనారాయణ తెలిపారు.

అంగన్‌వాడీ భవనానికి గ్రహణం

పదేళ్లయినా పూర్తికాని నిర్మాణం

కోట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు పంచాయతీ వజ్జవారిపాళెంలో పదేళ్ల క్రితం చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు గోడలకే పరిమితమై ఉంది. 2014-16 విద్యా సంవత్సరంలో రూ.7.5 లక్షల ఉపాధి నిధులతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ గోడలు నిర్మించారు. అప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు డ్రా చేసుకున్నారు. ఆ తరువాత పనులు కొనసాగించలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అంగన్‌వాడీ భవన నిర్మాణం గోడలకే పరిమితమయ్యాయి. దీంతో స్థానికంగా ఉన్న పాఠశాల భవనంలోనే అంగన్‌వాడీ చిన్నారులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై సీడీపీవో మునికుమారితో మాట్లాడగా అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని చెప్పారు.


అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణం

పరిహారం తీసుకుని పంటలు సాగు చేయడం సరికాదు

కోట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాగరమాల రోడ్డు విస్తరణకు ఇచ్చిన భూముల్లోకి రైతులు వెళ్లొద్దని తహసీల్దారు జయజయరావు కోరారు. మండల పరిధిలోని ఉనుగుంటపాళెం, రుద్రవరం, మైక్రోటవర్ కాలనీల సమీపంలో ఉన్న భూములను సోమవారం తహసీల్దారు జయజయరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల పరిధిలో రైతుల పట్టా భూములను సాగరమాల రోడ్డు విస్తరణకు తీసుకోవడం జరిగిందన్నారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపు దాదాపుగా పూర్తయిందని తెలిపారు. అయితే కొంతమంది రైతులు పరిహారం పొందినప్పటికీ తిరిగి అదే భూముల్లో మళ్లీ పంటలు సాగుచేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రోడ్డు పనులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో పరిహారం పొంది కూడా పంటలు సాగు చేయడం ఏమిటని రైతులను ప్రశ్నించారు. పంటలను తక్షణమే తొలగించాలని తహసీల్దారు హెచ్చరించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


ఊనుగుంటపాళెంలో సాగరమాల నిర్మాణానికి తీసుకున్న భూములను పరిశీలిస్తున్న తహసీల్దారు జయజయరావు, రెవెన్యూ సిబ్బంది

ఈ దారిలో వెళ్లేదెలా?


బురద నీటితో నిండిన రోడ్డు

దొరవారిసత్రం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరులో దళిత కాలనీ రోడ్లు బురదమయంగా మారాయి. ప్రధాన రహదారి నుంచి దళిత కాలనీకి వెళ్లే దారిలో వర్షపు నీరు నిల్వ చేరడంతో రొచ్చురొచ్చుగా మారింది. దీంతో ఆ మార్గంలో వెళ్లడానికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి దారిని బాగు చేయాలని కోరుతున్నారు.

నెలవలకు సన్మానం


టీడీపీ నాయకులు, సాగునీటి సంఘాల అధ్యక్షులతో నెలవల

ఓజిలి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యంను ఆ పార్టీ నాయకులు, నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘాల అధ్యక్షులు సోమవారం సన్మానించారు. నాయుడుపేటలోని ఆయన స్వగృహంలో ఓజిలి మండల టీడీపీ కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు ఆధ్వర్యంలో గున్నం సేవాట్రస్టు అధినేత గున్నం మధురెడ్డి, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, భువనగిరిపాళెం, జోస్యులవారికండ్రిగ సాగునీటి సంఘాల అధ్యక్షులు శంకరరాజు, రాజా సన్మానించారు. కార్యక్రమంలో మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కె ఖలీల్, యూనిట్ ఇన్‌చార్జి కంకణాల సత్యవర ప్రసాద్‌రావు, సీనియర్ నాయకులు బచ్చల రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్ల పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, పక్కనే రోటరీ మాజీ అధ్యక్షురాలు ప్రతిమ, శాంతకుమారి

సూళ్లూరుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాలను పురష్కరించుకొని మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య చేతుల మీదుగా దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శ రామకృష్ణ, మాజీ అధ్యక్షురాలు సుంకర ప్రతిమ, తన్నీరు శేషగిరిరావు, నాదెండ్ల శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే కురుగొండ్లను కలిసిన రావిళ్ల


కురుగొండ్లను సన్మానిస్తున్న రావిళ్ల

బాలాయపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కయ్యూరు గ్రామానికి చెందిన రావిళ్ల వెంకటకృష్ణమనాయుడు సోమవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను శాలువతో సత్కరించారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం: ఒకరి అరెస్టు

మంగళం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా చెయ్యేరు నదీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐ వై.విశ్వనాథ్ బృందం జొండ్రపెంట ఎఫ్‌బీవోతో కలిసి ఆదివారం గుర్రపుబాట తూర్పువైపు ఉన్న చెయ్యేరు వద్ద కూబింగ్ చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున మేకలకోన వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. చుట్టుముట్టేందుకు ప్రయత్నించగా దుంగలు పడేసి పారిపోయారు. వెంటపడి ఒకరిని పట్టుకున్నారు. ఆ ప్రాంతంలో పరిశీలించగా ఆరు ఎర్రచందనం దుంగలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని, పట్టుబడ్డ స్మగ్లర్‌ను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని శ్రీసిటీ కార్మికుడి మృతి

సూళ్లూరుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న సిరాపురం దినేష్(26) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన సోమవారం చోటుచేసుకొంది. పోలీసుల సమాచారం మేరకు.. తిరుపతికి చెందిన దినేష్ శ్రీసిటీలో పనిచేస్తున్నాడు. ముగ్గురు స్నేహితులతో కలిసి సూళ్లూరుపేటలోని స్వతంత్రపురంలో గది అద్దెకు తీసుకొని ఉంటున్నారు. సోమవారం జనరల్ షిఫ్ట్ కావడంతో దినేష్ విధులకు వెళ్లలేదు. రాత్రి స్నేహితులు వచ్చి చూడగా గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైదాపురం ఎంపీడీవోకు స్వల్పగాయాలు

గూడూరు అర్బన్, డిసెంబరు 16,(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలంలోని తిప్పారపాడు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సైదాపురం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. శివకుమార్ సోమవారం మోటర్ సైకిల్‌పై గూడూరు నుంచి సైదాపురానికి వెళ్తుండగా తిప్పారపాడు సమీపంలో అదుపు తప్పి బోల్తా పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. గూడూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

'ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం'

సూళ్లూరుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కమిషనర్ చిన్నయ్య ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి డ్రైనేజీ, ఇంటి స్థలాలు తదితర సమస్యల 15 అర్జీలు అందాయి. వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటామని కమిషనర్ చెప్పారు.

ఈ క్రాప్ నమోదుపై శిక్షణ

కోట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోటలోని వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఈ క్రాప్‌పై సహాయ వ్యవసాయ సేవకులకు శిక్షణ ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల వారీగా సహాయ వ్యవసాయ సేవకులకు ఈ క్రాప్‌పై నమోదుపై అవగాహన కల్పించారు.

ప్రజల వద్దకే రెవెన్యూ యంత్రాంగం


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ద్వారకానాథరెడ్డి

పెళ్లకూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల వద్దకు అధికారులను పంపి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యదర్శి, బంగారంపేట సర్పంచు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు ఇరుగు వెంకట సుబ్బయ్య అన్నారు. మండలంలోని మోదుగులపాలెంలో తహసీల్దార్ ద్వారకానాథరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై 15 మంది రైతులు అర్జీలు అందజేశారు. ఇందులో 5 మంది భూ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోషిబాయి, వీఆర్వో వంశీకృష్ణ, సర్వేయర్ పూజిత, సూర్యనారాయణ, వీఆర్ఏ అల్లాకుల కృష్ణ, శైలజ, టీడీపీ నాయకులు గుంటపూడి గురవయ్య, గంగాబత్తిన వెంకటకృష్ణయ్య, శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

మనవాలిలో రెవెన్యూ సదస్సు

ఓజిలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం మనవాలిలో తహసీల్దారు పద్మావతి ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ సదస్సు జరిగింది. భూ సమస్యలపై పలువురు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో దిలీప్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పిగిలాం, జార్లపాడు గ్రామాల్లో...

బాలాయపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సోమవారం మండలంలోని పిగిలాం, జార్లపాడు గ్రామాల్లో సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పాసు పుస్తకాలు, 1బీ నమోదు కోసం 9, పక్కా గృహాల కోసం 4అర్జీలు అందాయి. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, తాకరరామారావు, కూటమీ నాయకులు ముప్పాళ్ల మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాధిత మహిళకు ఎమ్మెల్యే చేయూత


బాధితురాలికి నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పండ్లూరులో నివసిస్తున్న రాజేశ్వరి ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోవడంతో నిరాశ్రయురాలైంది. సోమవారం నాయుడుపేట పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ బాధిత మహిళకు రూ.10వేల నగదు అందజేశారు.

ఆమె ఎందుకొచ్చినట్లు?

వెంకటగిరి ఎమ్మెల్యే ఇంటికొచ్చిన వైసీపీ మహిళా నేతను అడ్డుకున్న కార్యకర్తలు

వెంకటగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఇంటి వద్దకు వైసీపీ మహిళానేత ఒకరు వచ్చారు. కార్యకర్తలు ఆమెను అడ్డుకున్నారు. సోమవారం జరిగిన ఈ సంఘటన పట్టణంలో చర్చగా మారింది. గతంలో తెలుగుదేశంలో ఉండి ప్రస్తుతం వైసీపీ మహిళా విభాగంలో నాయకురాలుగా ఉన్న ఆమె తిరిగి దేశం గూటికి చేరేందుకు కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. ఈ నేపథ్యంలో నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘాల అధ్యక్షులతో తన నివాసంలో ఎమ్మెల్యే కురుగొండ్ల సమావేశమై ఉన్న సమయంలో ఆ మహిళా నేత వచ్చారు. ఇక్కడేం పని అంటూ కార్యకర్తలు ఆమెతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆమె ఎమ్మెల్యేను కలవకుండానే వెనుదిరిగిపోయినట్లు తెలిసింది.

అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయండి


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

గూడూరు అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్‌కు చెందిన కండక్టర్లు, డ్రైవర్ల అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపో మేనేజర్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్‌కు చెందిన కండక్టర్లు, డ్రైవర్లను అక్రమంగా సస్పెండ్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ విషయమై ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్న నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, అంకయ్య, రాము, శ్రీధర్, శేషయ్య, శ్రీనివాసులు, శివకుమార్, సురేష్, రమణయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

దక్కిలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రణాళికలను రూపొందించాలని పంచాయతీ విస్తరణ అధికారి అల్లాభక్షు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాతనాలపాడు, వెంబులూరు, నాగవోలు, పలుగోడు సచివాలయాల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బందికి పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సమావేశమై ప్రతిపాదిస్తే ప్రభుత్వం నుంచి అనుమతులతో పాటు నిధులు విడుదల అవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గుణశేఖరరెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సంతానేశ్వరిస్వామి సేవలో కొండేపాటి


సంతానేశ్వరస్వామి ఆలయం వద్ద కొండేపాటి, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారు పోలూరులో ఉన్న సంతానేశ్వరస్వామిని ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నేత కొండేపాటి గంగా ప్రసాద్ సోమవారం దర్శించుకొన్నారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, మాజీ ఎంపీపీ పిట్ల సుబ్రహ్మణ్యం, పాముూరు మునస్వామి, శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంచొద్దు


టవర్ క్లాక్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఛార్జీలను పెంపుదలను వెంటనే ఆపాలని సీపీఎం నాయకుడు శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక టవర్ క్లాక్ వద్ద సీపీఎం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. విద్యుత్ బిల్లుల జిరాక్స్ కాపీలను దహనం చేసిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పెరిగిన విద్యుత్ ఛార్జిలను తగ్గిస్తామని ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, శ్రీనివాసులు, బీవీ రమణయ్య, సురేష్, శంకరయ్య, చంద్రయ్య, ప్రసాద్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులకు సేవాదృక్పథం ఉండాలి

- కురుగొండ్ల


హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులు వ్యాపారాభివృద్ధితో పాటు సేవాదృక్పథంతో పనిచేయాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం వెంకటగిరి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్యాంకులు రైతులు, విద్యార్థులకు విరివిగా రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్ బ్యాంకు క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీనివాస్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, సామల లక్ష్మీపతి, అవ్వారు సత్యం, పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి వెంకటరెడ్డి, తోట కృష్ణయ్య పాల్గొన్నారు.

వడ్డెర్ల సంక్షేమానికి కృషి: రాష్ట్ర అధ్యక్షుడు మురళి


మురళీని సత్కరిస్తున్న జిల్లా నూతన కమిటీ సభ్యులు

రేణిగుంట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వడెర్ల సంక్షేమానికి కృషి చేస్తానని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవళ్ల మురళి అన్నారు. మండలంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ... ప్రభుత్వ సంక్షేమ పథకాలు వడెర్లకు అందేలా చూస్తామన్నారు. బడ్జెట్‌లో ఎక్కువ శాతం వడెర్లకు కేటాయించేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లా వడెర్ల సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంజి మదన్‌మోహన్, కార్యదర్శిగా దేవళ్ల రమణ, కోశాధికారిగా మునిశంకర్, కమిటీ సభ్యులుగా చంద్రగిరి జ్యోతి, వి.మహేంద్ర, చల్లా రమణ, ఆదినారాయణను ఎన్నుకున్నారు. వడెర్ల హక్కుల సాధనకు కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిని నూతన కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

ఆన్‌లైన్ మార్కెటింగ్‌ను సద్వినియోగం చేసుకోండి

- వెలుగు సీసీ శివకుమార్

సత్యవేడు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలు ఉత్పత్తి చేస్తున్న సరుకులకు సంబంధించి ఆన్‌లైన్ మార్కెటింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వెలుగు సీసీ శివకుమార్ పిలుపు నిచ్చారు. సోమవారం స్త్రీశక్తి భవనంలో గ్రామ సంఘం అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్కెటింగ్ కోసం ముందుగా ఆన్‌లైన్ రిజిస్టర్ చేసుకోవాల్సి ఉందన్నారు. ఒకసారి ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో ప్రవేశిస్తే సరుకు విక్రయాలు పెరుగుతుందన్నారు. అలాగే ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ రుణాల కోసం సంబధిత వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 35 శాతం రాయితీతో రుణం మంజూరవుతుందన్నారు. ముఖ్యంగా పశువులు, గొర్రెలు, పందుల పెంపకం వంటి పశు సంపదకు సంబంధించి రుణాలు పొందవచ్చన్నారు. ఈ సమావేశంలో వెలుగు కో ఆర్డినేటర్ పళని, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు కోటీశ్వరి, అకౌంటెంట్ కాంచన పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును గడువులోగా పూర్తి చేద్దాం: టీడీపీ


పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టీడీపీ నాయకులు

నారాయణవనం, డిసెంబర్ 16(ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వ నమోదును సవాల్‌గా తీసుకుని పూర్తి చేద్దామని టీడీపీ మండల నాయకులు భాస్కరన్, ఆర్‌డీ ఏకాంబరం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం కార్యకర్తలతో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబర్ నుంచి ప్రారంభమైన నమోదు ఈనెల 21వ తేదికి వంద శాతం పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఎమ్మెల్యే ఆదిమూలం, జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుందామన్నారు. మాణిక్యం రెడ్డి, జయచంద్ర నాయుడు, సుబ్రమణ్యం, అచ్చుకట్ల హరి, సుధా, బాబు, మురుగేశం రెడ్డి, నరేష్, నాగలయ్య, నాగరాజు, సొరకాయలు, కన్నప్ప, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వపై ఫిర్యాదు


సిలిండర్లు నిల్వ చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

నాగలాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జన సంచారం ఉన్న ప్రాంతంలో అక్రమంగా గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచడంపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగలాపురానికి చెందిన శ్రీనివాసరావు భారత్, ఇండియన్ గ్యాస్ సిలిండర్లను గ్రామాల్లో డెలివరీ చేస్తుంటాడు. అయితే నాగలాపురం బజారు వీధిలో జన సంచారం ఉన్న చోట తన ఇంటి వద్దే ఓ గోడౌన్ ఏర్పాటు చేసుకుని అందులో సుమారు 50 గ్యాస్ సిలిండర్లు నిల్వ ఉంచుతున్నారు. ఎటువంటి భద్రతా చర్యలు చేపట్టడం లేదు. దీంతో స్థానికులు ఎస్ఐ సునీల్‌కు ఫిర్యాదు చేశారు. సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ విషయాన్ని అగ్నిమాపక శాఖకు సమాచారం అందిస్తామని తెలిపారు.

శంకరాపురం చెరువు ఆయకట్టు అధ్యక్షుడు పద్దురాజుకు సన్మానం



పిచ్చాటూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి శంకరాపురం చెరువు ఆయకట్టు అధ్యక్షుడు దొమ్మరాజు పద్దురాజును, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళం గోవన్‌రెడ్డిని అడవి కొడియంబేడుకు చెందిన టీడీపీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి ఎం.ఎస్.రవి, గ్రామ కమిటీ ప్రచార కార్యదర్శి రవి సహా దళిత నాయకులు సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించారు. ఆయకట్టు అభివృద్ధికి కృషి చేయాలని పద్దురాజును కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, వినాయక, డిల్లీ, వాసురెడ్డి, భక్తారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుతోనే భావి తరాలకు వెలుగు


వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఆర్డీవో

శ్రీకాళహస్తి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపుతోనే భావితరాలకు వెలుగు పంచగలమని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం విద్యుత్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఇంధన పొదుపు వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ... విద్యుత్‌ను వృథా చేయడం మానుకోవాలన్నారు. విద్యుత్ పొదుపుపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాలన్నారు. అనంతరం వారోత్సవాల ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో శ్రీకాళహస్తి రూరల్ ఏడీఈ ఏ.సుబ్రహ్మణ్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చక్రేశ్వరస్వామికి ఆరుద్ర పూజలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మ గుడి వీధిలో కొలువై ఉన్న చక్రేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా స్వామివారికి పలు రకాల అభిషేకాలను నిర్వహించి విశేషంగా అలంకరించారు. అనంతరం వేదపండితులు ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కేంద్రమంత్రికి సాదర వీడ్కోలు



రేణిగుంట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర చేనేత మంత్రి గిరి రాజ్‌సింగ్‌కు సాదరంగా వీడ్కోలు పలికారు. తిరుపతిలో రెండు రోజుల పర్యటన నిమిత్తం విచ్చేసిన ఆయన సోమవారం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి విమానాశ్రయం వద్ద టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ నాయకురాలు తేజోవతి తదితరులు కేంద్ర మంత్రికి వీడ్కోలు పలికారు.

చెరువు వేలం: పంచాయతీకి ఆదాయం

వరదయ్యపాళెం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండంలోని పాండూరు పెద్ద చెరువులో చేపల పెంపకానికి సోమవారం సచివాలయంలో వేలం నిర్వహించారు. మాజీ సర్పంచు శ్రీరాములు రూ.3,87,500కు దక్కించుకున్నాడు. సర్పంచు కవిత కృష్ణయ్య, ఆయకట్టు అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు అంకమ్మ, పంచాయతీ కార్యదర్శి తిరుమల తదితరులు పాల్గొన్నారు.

భయంభయంగా విధులకు హాజరు!

ఎప్పుడు కూలుదుందోనని ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఆందోళన





కార్యాలయ గదుల్లో స్లాబ్ పెచ్చులూడి కనిపిస్తున్న కమ్మీలు - టేబుల్‌పై పాము కుబుసం

ఏర్పేడు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించే అధికారులు భయంభయంగా విధులకు హాజరవుతున్నారు. వారు విధులు నిర్వహిస్తున్న కార్యాలయ స్లాబ్ పెచ్చులూడి కమ్మీలు బయటపడి కూలడానికి సిద్ధంగా ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. ఇది ఎక్కడో కాదు తిరుపతి జిల్లా కేంద్రానికి అతి దగ్గరలో ఉన్న ఏర్పేడు ఎంపీడీవో కార్యాలయంలో పరిస్థితి ఇది. ఏర్పేడు ఎంపీడీవో కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్ పెచ్చులూడి కమ్మీలు బయటపడ్డాయి. వర్షాకాలంలో ఉరుస్తోంది. ఇటీవల రెండ్రోజుల పాటు కురిసిన వర్షానికి కార్యాలయం సహా ఇతర గదులు ఉరుస్తున్నాయి. రికార్డులు తడచిపోతున్నాయి. కార్యాలయంలోని పలు గదుల్లో పాముల కుబుసం కనిపించింది. రాత్రి వేళల్లో గదుల్లోకి పాములు చేరుతున్నట్టు సిబ్బంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటు పాముల బెడద అటు పెచ్చులూడడంపై సిబ్బంది ఇబ్బంది పడతున్నారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని సిబ్బంది కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులతో ప్రజలకు లబ్ధి: ఆదిమూలం


యానాదివెట్టులో జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే

వరదయ్యపాళెం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులతో ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. మండలంలోని యానాదివెట్టులో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం చేసిన పాపాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలు ఇచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను కోరారు. తహసీల్దారు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నాగనందాపురంలో టీడీపీ నాయకుడు కరుణాకర్‌నాయుడు ఆధ్వర్యంలో 200 మందికి టీడీపీ సభ్యత్వం చేయించారు. కంచరపాళెంలో తుఫాను కారణంగా ఇళ్లల్లోకి నీరు చేరిన బాధితులకు ఎమ్మెల్యే నిత్యావసర సరుకులను అందజేశారు.

కేవీబీపురం: రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించుకోవడానికి రెవెన్యూ సదస్సులు వేదిక అని తహసీల్దారు మునిరత్నంరెడ్డి తెలిపారు. సోమవారం పూడి సీకేపురంలో నిర్వహించిన సదస్సులో 48 అర్జీలు వచ్చాయని ఆయన తెలిపారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాలలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో 58 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. మ్యుటేషన్‌కు 47, పట్టాదార్ పాసుపుస్తకాలకు 7, పీవోటీ 3కి అర్జీలు వచ్చినట్లు తెలిపారు. డీటీ చంద్రబాబు నాయుడు, ఆర్ఐ నల్లయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: మండలంలోని వేలూరు గ్రామంలో సోమవారం తహసీల్దార్ రమేష్‌బాబు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. పాసుపుస్తకాల్లో చేర్పులు, మార్పులు, ఇంటి పట్టాల కోసం అర్జీలు అందాయి. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.

శ్రీకాళహస్తి: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తొట్టంబేడు తహసీల్దారు మధుసూదన్‌రావు కోరారు. మండలంలోని చియ్యవరంలో రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. శ్రీకాళహస్తి మండలం వేలవేడు, ముద్దుమూడిల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పరిశీలన



బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబుగోళం, చిన్నాయగుంటల్లో నీట మునిగిన వరిని మండల వ్యవసాయాధికారి భారతి సోమవారం పరిశీలించారు. వరుస తుపాన్లతో ఇప్పటికే రెండు సార్లు వరి వేశామని రైతులు ఏవో ముందు వాపోయారు. గత వారంలో కురిసిన భారీ వర్షాలకు పంట ఇంకా నీటిలోనే ఉందన్నారు. తమకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. పంట నష్టంపై జిల్లా అధికారులకు నివేదిక ఇస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

బాల్య వివాహం అడ్డగింత

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో బాల్య వివాహాన్ని ఎస్ఐ విశ్వనాథ నాయుడు సిబ్బందితో అడ్డుకున్నారు. విద్యార్థికి బంధువుల యువకుడితో పెళ్లి చేస్తున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ అడ్డుకున్నారు. బాలిక తల్లిదండ్రులను తహసీల్దార్ సుబ్రమణ్యం ఎదుట హాజరు పరిచారు. బాలికకు వివాహం చేస్తే రూ.లక్ష రూపాయిలు చెల్లిస్తామని బాండు తీసుకున్నారు. అనంతరం తల్లిదండ్రులకు బాల్యవివాహాల కారణంగా కలిగే నష్టాలపై ఐసీడీఎస్ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యం


గ్రామస్తులను పరీక్షిస్తున్న వైద్యులు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారించవచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దివాకర్ తెలిపారు. మండలంలోని కాంపాళెం, కారణి గ్రామాల్లో స్విమ్స్, శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ ఉచిత పరీక్షలు నిర్వహించారు. రెండు పింక్ బస్సుల్లో మహిళలకు పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వారా పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విద్యాసాగర్, స్విమ్స్ డాక్టర్లు పద్మావతి, చైతన్యభాను, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, కార్తిక్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మనోన్మణి ఉత్సవం



శ్రీకాళహస్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ముక్కంటీశుడి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని సోమవారం మనోన్మణి (గొబ్బెమ్మ) ఉత్సవం వైభవంగా నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో గొబ్బిదేవతకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారిని చప్పరంపై అధిష్టింపజేసి పట్టణంలో ఊరేగించారు. అమ్మవారికి భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

అదానీ అవినీతిపై నోరు మెదపరేం: సీపీఎం



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అదానీ విద్యుత్ కుంభకోణంపై కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదని సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి ప్రశ్నించారు. సెకీ ఒప్పందంలో బయట పడ్డ రూ.1,700 కోట్ల కుంభకోణంపై విచారణ ఎప్పుడు ప్రారంభిస్తారన్నారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలపై ట్రూ అప్ సర్దుబాటు ఛార్జీల భారం మోపవద్దన్నారు. సెకీ ఒప్పందం రద్దు చేయక పోవడం, కుంభకోణంపై బీజేపీ, టీడీపీ, వైసీపీ, జనసేన నోరు మెదపక పోవడంపై అందులో వారికి అందులో వాటాలున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, వెంకటేష్, కేశవమ్మ, నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సినీ దర్శకుడు పరశురామ్



శ్రీకాళహస్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని సోమవారం సినీ దర్శకుడు పరశురామ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

పిచ్చాటూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి-చెన్నై జాతీయ రహదారి లోని రామగిరి టర్నింగ్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. రామగిరికి చెందిన మణికంఠ, నాగరాజు సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో నాగలాపురానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో రామగిరి టర్నింగ్ వద్ద టర్బో లారీ ఢీకొనడంతో మణికంఠ(34) దుర్మరణం చెందాడు. నాగరాజును స్థానికులు తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి మణికంఠ మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా మణికంఠకు ఏడాదిన్నర క్రితం వివాహం కాగా భార్య ఆరు నెలల క్రితం క్యాన్సర్‌తో మృతి చెందింది.

నేటినుంచి ఆధార్ క్యాంపులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలంలో ఈనెల 16న మంగళవారం నుంచి 20వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేంద్రనాథ్ తెలిపారు. 17వ తేదీన చేమూరు, 18న చియ్యవరం, 19న ఇలగనూరు, 20న పెద్దకన్నలిలో క్యాంపులు నిర్వహిస్తారన్నారు. ప్రజలు, విద్యార్థుల ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులుంటే చేసుకో వాలన్నారు.

ఆగమోక్తంగా మృత్యుంజయుడికి పూజలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. ముందుగా వినాయకుడికి పూజలు చేశారు. అనంతరం మృత్యుంజయుడికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న అయ్యప్పస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో అయ్యప్పస్వామి ఉత్సవమూర్తికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించారు. మేళతాళాలు, వేద మంత్రోచ్చరణల నడుమ అయ్యప్పస్వామికి ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని స్వామివారికి ప్రతిరోజు ఉదయం అభిషేకాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.

పూడి గ్రామాలకు తాత్కాలిక మట్టి రోడ్డు



కేవీబీపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజులకండ్రిగ వద్ద సమీపంలో పూడి గ్రామాలకు వెళ్లే కాజ్‌వేను మట్టి పోసి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇటీవల భారీ వర్షాలకు మట్టి వంతెన కొట్టుకుపోయిన విషయం విదితమే. వారం రోజుల పాటు పూడి సహా ఐదు గ్రామాల ప్రజలకు చుట్టుపక్కల గ్రామాలతో సంబంధాలు తెగిపోయాయి. ఈక్రమంలో రాజులకండ్రిగ సర్పంచు వెంకటేష్ ఆధ్వర్యంలో సోమవారం తాత్కాలికంగా మట్టి రోడ్డును ఏర్పాటైంది. దీంతో పూడి గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.